బుధవారం
15-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 234
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'నాటో హంతకులు తిరిగెళ్లండి'

అమెరికా, గ్రీస్ సంయుక్తంగా నిర్వహించిన సైనిక విన్యాశాలకు వ్యతిరేకంగా గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఉత్తర గ్రీస్‌లోని ఝాంథీలో ఆందోళన నిర్వహించింది. సామ్రాజ్యవాద యుద్ధంలో దేశం పాలుపంచుకోవడాన్ని వ్యతిరేకించింది.

2లో

గ్రామ సచివాలయాలకు నరేగానా ?

- నిధుల వినియోగానికి కేంద్రం అనుమతించిందా?
- గ్రామీణాభివృద్ధి శాఖకు లేఖైనా రాశారా?
- రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ప్రశ్నల వర్షం
- రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రామ సచివాలయ నిర్మాణాలకు నరేగా నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. పాఠశాలల ఆవరణలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల నిర్మాణంపై మంగళవారం విచారణ జరిగింది. ఈసందర్భంగా సచివాలయాల నిర్మాణానికి నరేగా నిధులు వినియోగించిన అంశాన్ని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వ తరపు న్యాయవాది సమాధానమిస్తూ గ్రామ సచివాలయాలు పంచాయతీరాజ్ చట్టం పరిధిలో లేవని కోర్టుకి తెలియజేశారు. సచివాలయాలు రాష్ట్ర పరిధిలోకి వస్తాయని తెలిపారు. గ్రామ

- మిగతా 2 లో

మోదీ ఫాసిస్టు విధానాలు బట్టబయలు

బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులకు సీపీఐ ఖండన

న్యూదిల్లీ: ప్రముఖ మీడియా దిగ్గజం బీబీసీకి చెందిన దిల్లీ, ముంబై కార్యాలయాలపై ఐటీ దాడులతో మోదీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలు బట్టబయలయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విమర్శించింది. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విమర్శించే ప్రతి ఒక్కరిపై దాడులకు తెగబడటంతో మోదీ ప్రభుత్వ మతోన్మాద-ఫాసిస్టు విధానాలు బట్టబయలయ్యాయని విమర్శించింది. 'ది మోదీ క్వశ్చన్' డాక్యుమెంటరీని బీబీసీ ఇటీవల విడుదల చేసిన క్రమంలోనే మోదీ ప్రభుత్వం కక్షసాధింపునకు దిగిందని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. ఈ డాక్యుమెంటరీ ఎక్కడా ప్రసారం కాకుండా ఆంక్షలు విధించిందని, యూనివర్సిటీల్లోనూ ప్రసారం చేయకుండా నిషేధాజ్ఞలు జారీ చేసిందని గుర్తుచేసింది. విదేశీ మీడియా సంస్థను బెదిరించేందుకు ఇప్పుడు ప్రభుత్వ సంస్థను మోదీ సర్కార్ వాడుకుంటోందని విమర్శించింది. తద్వారా దేశ ప్రతిష్ఠ మంటగలుస్తోందని, ఇప్పటికే మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోయిందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది.

బీబీసీపై మోదీ 'ఐటీ' అస్త్రం

దిల్లీ, ముంబై కార్యాలయాల్లో 'సర్వే'లు

- పన్నుల అవకతవకల నెపంతో తనిఖీలు
- తీవ్రంగా ఖండించిన విపక్షాలు, ఎడిటర్స్ గిల్డ్
- పూర్తిగా సహకరిస్తున్నాం: మీడియా సంస్థ
- ప్రపంచంలోనే అత్యంత అవినీతి సంస్థ: బీజేపీ

న్యూదిల్లీ: తమను విమర్శించే ప్రతి ఒక్కరిపై ఐటీ/ఈడీ లేక సీబీఐ రూపేణ కక్షసాధింపు చర్యలకు పాల్పడటం కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. ఇటీవల 'ది మోదీ క్వశ్చన్' అంటూ గుజరాత్ అల్లర్లలో మోదీ పాత్ర నేపథ్యంలో విడుదలైన బీబీసీ డాక్యుమెంటరీ కేంద్రప్రభుత్వాన్ని కలవరపాటుకు గురిచేసింది. దీంతో ఆ డాక్యుమెంటరీ ఎక్కడా విడుదల కాకుండా, యూనివర్సిటీల్లోనూ ప్రసారానికి వీల్లేకుండా ఆంక్షలు విధించింది. డాక్యుమెంటరీ వివాదం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉండగానే బ్రిటన్‌కు చెందిన మీడియా సంస్థపై తమదైన శైలిలో కక్షసాధింపు చర్యలకు మోదీ సర్కార్ పూనుకుంది. భారత్‌లోని దిల్లీ, ముంబైలోగల బీబీసీ కార్యాలయాలపైకి 'ఐటీ' అస్త్రాలు సంధించింది. 'సర్వే' పేరుతో సోదాలు జరిపించింది. అంతర్జాతీయ పన్నుల అవకతవకలు, బీబీసీ సబ్సిడరీ కంపెనీల్లో ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్‌పై సర్వే నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు. బీబీసీకి ముందే నోటీసులు ఇవ్వగా ఆ సంస్థ స్పందన సంతృప్తికరంగా లేదన్నారు. లండన్‌లోని ప్రధాన కార్యాలయంతో పాటు భారత్‌లోని శాఖల్లో వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలను ఐటీ అధికారులు తనిఖీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఐటీ సర్వేకు సహకరిస్తున్నాం: బీబీసీ

భారత్ రాజధాని దిల్లీతో పాటు ముంబై కార్యాలయాలపై ఐటీ శాఖ 'సర్వే'లకు పూర్తిగా సహకరిస్తున్నట్లు బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) వెల్లడించింది. తమ కార్యాలయాల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేసినట్లు ట్విట్టర్ మాధ్యమంగా తెలిపింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ఐటీ అధికారులు దిల్లీ, ముంబై కార్యాలయాలకు చేరుకున్నట్లు పేర్కొంది. ఆ కార్యాలయాల సిబ్బందిని లోపలికి వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని, వారి ఫోన్లు ఆపేశారని, ల్యాప్‌ట్యాప్లు, కంప్యూటర్లు వాడనివ్వలేదని తెలిపింది. 'ఐటీ సర్వేకు సహకరిస్తున్నాం. ఈ వ్యవహారం త్వరలోనే సద్దుమణుగుతుందని ఆశిస్తున్నాం' అని బీబీసీ ట్వీట్ చేసింది.

మరోవైపు ప్రతిపక్షాలు ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించాయి. అదానీ గ్రూప్‌పై హిండర్‌బర్గ్ నివేదిక గురించి దర్యాప్తు కోసం తామంతా డిమాండ్ చేస్తుంటే కేంద్రప్రభుత్వం బీబీసీ మీద పడిందని విమర్శించారు. పతనం దగ్గరపడినప్పుడు సంబంధిత వ్యక్తి సొంత ఆలోచనలకు విరుద్ధంగా వ్యవహరిస్తారని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. 'ప్రభుత్వం భయంతో సత్యం గొంతు నులిపేందుకు ఐటీ చర్యలకు పూనుకుంది'ని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం విమర్శించారు. 'బీబీసీపై దాడి చేసి సర్వే అంటారు! ఈ సర్వే... ప్రభుత్వం భయంతో చేపట్టిన కక్షసాధింపు చర్యలకు సంకేతం. సత్య గళాన్ని నొక్కేసే

- మిగతా 2 లో

బీజేపీకి విరాళాల వెల్లువ

- అత్యధికంగా కార్పొరేట్ల నుంచే...
- మిగతా జాతీయ పార్టీల కంటే మూడు రెట్లు అధికం: ఏడీఆర్



న్యూదిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి విరాళాలు వెల్లువెత్తాయి. 2021-22లో అత్యధికంగా రూ.614 కోట్లు సమకూరాయి. కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, ఎన్‌పీఈపీ, ఏఐటీసీ ప్రకటించిన మొత్తం కంటే బీజేపీకి మూడు రెట్లు అధికంగా వచ్చాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. 2021-22లో బీజేపీకి రూ.614 కోట్లు రాగా కాంగ్రెస్‌కు రూ.95కోట్లు వచ్చాయని పేర్కొంది. అన్ని జాతీయ పార్టీలకు కలిపి 7,141 దాతల ద్వారా రూ.780.774 కోట్లు సమకూరినట్లు ఏడీఆర్ పేర్కొంది. బీజేపీకి 4,957 దాతల నుంచి రూ.614.63 కోట్లు వస్తే 1,255 దాతల నుంచి రూ.95.46 కోట్లు కాంగ్రెస్‌కు వచ్చాయని ఎన్నికల సంస్కరణల సంస్థ తెలిపింది. జాతీయ పార్టీలన్నీ ప్రకటించిన (రూ.77.08కోట్లు) కంటే ఏడు రెట్లు అధికంగా కార్పొరేట్ విరాళాలు రూ.548.81 కోట్లు బీజేపీకి వచ్చినట్లు పేర్కొంది. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.353 కోట్లను బీజేపీ, కాంగ్రెస్‌కు కలిపి విరాళంగా ఇచ్చినట్లు తెలిపింది. పసిఫిక్ ఎక్స్‌పోర్ట్స్ ఏడు సార్లుగా రూ.10.50 కోట్లు, ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ రూ.10 కోట్లు, శ్రీజీ షిప్పింగ్ రూ.10.00 కోట్లు, యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రూ.10 కోట్లు బీజేపీకి విరాళమిచ్చినట్లు ఏడీఆర్ తెలిపింది. నువాకో విస్టార్స్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.15కోట్లు కాంగ్రెస్‌కు ఇచ్చిందని పేర్కొంది. 16 ఏళ్లుగా చెబుతున్నట్లుగానే 2021-22లో రూ.20వేలకు మించి తమకు విరాళాలు రాలేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రకటించినట్లు వెల్లడించింది. 2021-22లో జాతీయ పార్టీల విరాళాల మొత్తంలో రూ.187.03 కోట్లు పెరిగాయని, 2020-21తో పోల్చితే ఇది 31.50శాతం ఎక్కువని తెలిపింది. ఒక్క బీజేపీకి విరాళాలు 28.71శాతం పెరిగాయని, 2019-20తో పోల్చితే 2020-21లో

- మిగతా 2 లో

ప్రాజెక్టుల పూర్తిలో విఫలం

- కబ్జాలు చేయడంలో మునిగి తేలుతున్నారు
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు పోరు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వేదవతి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఐ బృందం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తి చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలం అయిందనీ, కబ్జాలు చేయడంలో వారు మునిగి తేలుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ప్రాజెక్టులు పరిశీలనలో భాగంగా రెండవ రోజు మంగళవారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, హరినాధరెడ్డి, ఈశ్వరయ్య, అక్కినేని వనజ, జగదీశ్, పి.రామచంద్రయ్య, జంగాల అజయ్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, అవులశేఖర్, నక్కి లెనిన్‌బాబు, గిడ్డయ్య, రంగనాయుడుతో కలసి ప్రాజెక్టులు పరిశీలించారు. వేదవతి, గుండ్రేవుల, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన కరువు ప్రాంతాలకు తాగునీరు, సాగునీటి కోసం వేదవతి ప్రాజెక్టు కరువు పీడిత ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఏడాది 30నుంచి 40టీఎంసీల నీరు వృథాగా పోతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి రు.1942కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం నిర్ణయించినా 16కోట్లు మాత్రమే విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. భూసేకరణ చేసి రైతులకు పరిహారం చెల్లించడంలో విఫలం అయిందన్నారు. మలగవెల్లి వద్ద జలాశయం పనులు ప్రారంభించకుండా ప్రభుత్వం ఏమి చేస్తోందని నిలదీశారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుంటే కాంట్రాక్టర్లు పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను పాలకులు ముందుకు తేవడం తప్పితే చిత్తశుద్ధి లేదన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు సర్వే కోసం 2013నవంబరులో అనుమతులు ఇచ్చి దాదాపు 10సంవత్సరాలు గడిచినా ఒక్క బస్తా సిమెంట్ కూడా వేయలేదన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం చేపడితే సుమారు 20టీఎంసీల నీరు నిల్వ ఉంచుకోవచ్చన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టుకు, కర్నూలు నగరంలో తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు అయినా ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయలేదన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును అధునికీకరణ చేస్తానని చెప్పి నేడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టకపోగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని రామకృష్ణ విమర్శించారు. రాబోయే బడ్జెట్‌లో వేదవతి నదికి 500కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఒత్తిడి పెంచి ప్రాజెక్టులు పూర్తి అయ్యేంత వరకు పోరాటం చేస్తామని రామకృష్ణ తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమైన తాగు, సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంలో రాష్ట్రప్రభుత్వం విఫలం అయిందన్నారు. సీపీఐ అధ్వర్యంలో వారం రోజుల పాటు రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను అన్నింటిని పరిశీలించి చర్చించి వాటిని ప్రభుత్వం త్వరగా పూర్తి చేసేందుకు ఒక ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నామని చెప్పారు.

వైసీపీ నేతలు కబ్జా చేసిన పొలాల పరిశీలన: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కబ్జాలు చేయడంలో మునిగి తేలుతోందని వారికి అభివృద్ధి పట్టడం లేదని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నియోజకవర్గ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సారు, ప్రచార యావ బానే వుంది గానీ పొరపాటు సంకేతాలు వెళతాయేమో బావా!

పోలీస్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు

- దిశ యాప్‌తో కోటిపైగా డౌన్‌లోడ్స్
- పర్యాటకుల సౌకర్యం, భద్రతకు ప్రత్యేక స్టేషన్లు
- పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో 20 టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు
- ప్రారంభించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పోలీస్ శాఖలో గతంలో ఎన్నడూలేని విధంగా విప్లవాత్మక సంస్కరణలు అమలు చేశామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. గ్రామ స్థాయిలోనే మహిళా పోలీసులు, గ్రామ సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకురావడం, ఎప్పుడూ జరగని విధంగా జీరో ఎఫ్ఐఆర్‌ని... మొట్టమొదటగా రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అలాగే పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లినప్పుడు అక్కడ ప్రవర్తించే విధానంలో గతానికి ఇప్పటికీ గణనీయమైన తేడా కనిపించే విధంగా పోలీసులు మీ స్నేహితులు అనే భావనను కలిగిస్తూ... అన్ని పోలీస్ స్టేషన్లలో రిసెప్షనిస్టును ఏర్పాటు చేసి ఫిర్యాదుదారులకు తోడుగా నిలబడే కార్యక్రమం చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 20 టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను వర్చువల్‌గా సీఎం క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ యాప్ చరిత్ర సృష్టిస్తోందని, ఇప్పటివరకు దాదాపు 1 కోటి

- మిగతా 2 లో

పాఠాలు చదువుతూనే

మృత్యుఒడికి

- బడి ఆవరణలో ఘోరం
- కూలిన విద్యుత్ స్తంభం
- ఒకరి మృతి- మరొకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - హుకుంపేట (అల్లూరి): పాఠాలు చదువుకుంటూ ఓ చిన్నారి మృత్యుఒడికి చేరుకుంది. మరో చిన్నారి నడుము విరిగింది. ఆరు బయట తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో పాఠశాల వద్దనున్న విద్యుత్ స్తంభం కూలి రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల తుబూరు దన్విత‌పై పడింది. దీంతో ఆమె మరణించింది. పక్కనే ఉన్న నిహారిక నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన

- మిగతా 2 లో

బీబీసీ కార్యాలయాలపై

దాడులు బెదిరింపే...

అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంస్థలు

న్యూయార్క్: భారత్‌లోని బీబీసీ దిల్లీ, ముంబై కార్యాలయాలపై ఐటీ దాడులు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు అవమానకరం, బెదిరింపులకు యత్నమని అంతర్జాతీయ మీడియా, మానవహక్కుల సంఘాలు విమర్శించాయి. తమ చర్యలను పన్ను ఎగవేత ఆరోపణలపై దర్యాప్తుగా ఐటీ అధికారులు చెప్పుకున్నారు. భారత ప్రభుత్వ చర్యలు భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసేలా ఉన్నాయని న్యూయార్క్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే), పారిస్‌కు చెందిన రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ (ఆర్ఎస్‌పీ), ది సౌతేషియా సాలిడరిటీ గ్రూప్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొన్నాయి. పాత్రికేయులను వేధించడాన్ని భారతీయ ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేశాయి. సీపీజే ఆసియా సమన్వయకర్త బే లీయా స్పందిస్తూ' ప్రధాని మోదీని విమర్శించే డాక్యుమెంటరీ కారణంగా మీడియా సంస్థను బెదిరించేందుకు బీబీసీ ఇండియాపై దాడులు చేశారు' అని అన్నారు. 'భారతీయ అధికారులు పన్ను ఎగవేతలపై దర్యాప్తు నెపంతో వార్తాసంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీబీసీ ఉద్యోగులను వేధించడం ఆపండి. స్వేచ్ఛకు విలువివ్వండి. అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఇటువంటి తగవు' అని సీపీజే ప్రకటన పేర్కొంది. భారతీయ ప్రభుత్వంపై విమర్శలను అణచివేసే యత్నమని బీబీసీలో ఐటీ సోదాలనుద్దేశించి రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ ట్వీట్ చేసింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ 'భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులు సుస్పష్టం. విమర్శించే గొంతకలను నొక్కేసే అస్త్రాలుగా ఐటీ శాఖకు అధికారులను బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతోంది' అని పేర్కొంది. ఆక్స్‌ఫామ్ ఇండియాతో పాటు అనేక ఎన్జీవోలపై గతేడాది ఐటీ దాడులు జరిగిన విషయాన్ని ఆమ్నెస్టీ గుర్తుచేసింది.

పాఠాలు చదువుతూనే మృత్యు ఒడికి

(మొదటిపేజీ తరువాయి)

అల్లూరి జిల్లా హుకుంపేట మండలం, తాడిపుట్టు పంచాయతీ ఉ్రడ బోడ్డపుట్టు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో జరిగింది. నాడు-నేడు పనుల కారణంగా ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఓ జీలుగు చెట్టు విద్యుత్ తీగలపై పడి నాలుగు స్తంభాలు కూలిపోయాయి. ఇందులో ఓ స్తంభం దన్విత తలపై పడగా ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. నిహారిక నడుము భాగంలో గాయపడింది. గ్రామస్థులు వెంటనే పిల్లలను హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా తన్విత మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిహారికను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. ఎంఈవో రామచంద్రరావు, ఎంపీడీవో వెంకటరావులు వెంటనే బోడ్డపుట్టు పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. ఎస్ఐ సతీశ్ ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చిన్నారి మృతిచెందడంతో ఉపాధ్యాయుడు, కాంట్రాక్టు, విద్యుత్ శాఖ సిబ్బందిపై కఠిన చర్యలకు తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

బీజేపీకి విరాళాల వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

41.49శాతం పెంపుదల కనిపించినట్లు ఏడీఆర్ పేర్కొంది. 2020-21లో కాంగ్రెస్‌కు రూ.74.52 కోట్లు కాగా 2021-22లో 28.09శాతం పెరిగి రూ.95.46కోట్లు సమకూరినట్లు తెలిపింది. మరోవైపు సీపీఎం విరాళాలు 22.06 శాతం తగ్గి రూ.2.85 కోట్లకు చేరాయి. నేషనల్ పీపుల్స్ పార్టీ విరాళాల్లో తగ్గుదల 40.50శాతంగా (రూ.24.10లక్షలు) నమోదైంది. దిల్లీ నుంచి జాతీయ పార్టీలకు మొత్తం రూ.395.85 కోట్లు రాగా మహారాష్ట్ర నుంచి రూ.105.3523 కోట్లు, గుజరాత్ నుంచి రూ.44.96 కోట్లు వచ్చినట్లు ఏడీఆర్ తెలిపింది. అస్పష్టమైన సమాచారం కారణంగా రూ.12.56 కోట్లు (జాతీయ పార్టీలకు వచ్చిన మొత్తం విరాళాల్లో 1.57శాతం) ఏ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతానికి చెందినవో కచ్చితంగా చెప్పలేకపోయినట్లు పేర్కొంది. 2,551 విరాళాలు కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి రాగా అవి వచ్చిన మొత్తంలో 80.16శాతం (రూ.625.88 కోట్లు)గా ఏడీఆర్ తెలిపింది. 4,506 మంది దాతల నుంచి రూ.153.33 కోట్లు (19.64శాతం) వచ్చాయని పేర్కొంది. కాంగ్రెస్‌కు 170 విరాళాలు కార్పొరేట్/వ్యాపార రంగాల నుంచి రూ.54.57 కోట్ల మేర రాగా 1085 మంది దాతల నుంచి రూ.40.89 కోట్లు వచ్చాయని ఏడీఆర్ తెలిపింది.

బీబీసీపై మోదీ 'ఐటీ' అస్త్రం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నం. ప్రపంచం అంతా చూస్తోంది. మోదీ జీ20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పుడు ఇదే విషయంలో ఆయనను నిలదీస్తుంది. భారత్‌లో పత్రికా స్వేచ్ఛపై ప్రశ్నిస్తుంది. అన్నింటికీ సమాధానాలు ఇవ్వగలరా?' అని విశ్వం ట్వీట్ చేశారు. ఇలా చేస్తే ప్రజాసామ్యానికి తల్లిలా భారత్ ఉండగలదా? అని సీపీఎం ప్రశ్నించింది. 'వినాశ కాలంలో విపరీత బుద్ధి' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. వాలెంటైన్స్ డే 'సర్వే'లు చేస్తున్న ఐటీ, సెబీ, ఈడీ... ప్రభుత్వానికి ఎంతో ప్రీతిపాత్రుడైన 'మిస్టర్ ఏ'ను సోదా చేయగలవా? అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ప్రశ్నించారు. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా స్పందిస్తూ 'బీబీసీ ఇండియా కార్యాలయాలపై ఐటీ సర్వేలు ఆందోళనకరం. ఇది మీడియా సంస్థలను బెదిరించడం, వేధించడం అన్న ప్రభుత్వ పంథా కొనసాగింపే...' అని వ్యాఖ్యానించింది. మీడియా సంస్థలు, పాత్రికేయుల హక్కులను హరించకుండా ఇటువంటి దర్యాప్తులప్పుడు అత్యంత సున్నితంగా వ్యవహరించాలని డిమాండ్ చేసింది. అయితే అన్ని విమర్శలను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌతం భాటియా తిప్పికొట్టారు. ఐటీ అధికారులను వారి పనిని చేసుకోనివ్వండి. బీబీసీ ప్రపంచంలోనే అత్యంత అవినీతిమయమైన సంస్థ అని వ్యాఖ్యానించారు.

సీనియర్ జర్నలిస్టు సీతారామయ్య మృతి

విశాలాంధ్ర-హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు మరిమంద సీతారామయ్య (72) మంగళవారం ఇక్కడ కన్నుమూశారు. గత ఐదు దశాబ్దాలుగా ఆయన జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. వివిధ పత్రికలలో అనేక హోదాలలో పనిచేశారు. 1974లో ఈనాడులో సబ్ఎడిటర్‌గా చేరిన ఆయన ఆ తరువాత ఆంధ్రభూమి, ఆదివారం వీక్లీలో చేశారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, వార్త తెలుగు దినపత్రికలలో పనిచేశారు. కాపిటల్ మార్కెట్ తెలుగు ఎడిషన్‌కు ఇన్‌చార్జి ఎడిటర్‌గా పనిచేశారు. పత్రికా వ్యాపారం వృద్ధి కోసం ఆయన సొంత వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. ప్రభ, పత్రిక, యువ, జ్యోతి తదితర వారపత్రికలు, సాహిత్య మాసపత్రికలకు ఆయన సంక్షిప్త కథలను రాశారు. సీతారామయ్య మృతికి అనేక మంది సీనియర్ జర్నలిస్టులు సంతాపం తెలిపారు.

న్యూజిలాండ్‌లో అత్యవసర పరిస్థితి

- గెబ్రియల్ తుపాను బీభత్సం : ముంపుకు గురైన దేశం
- వందల ఇళ్లకు విద్యుత్ కట్

ఆక్లాండ్: న్యూజిలాండ్‌లో గేబ్రియల్ తుపాను బీభత్సం సృష్టించింది. వందల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భీకర వర్షాలు, ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. వరదలు పోటెత్తిన కారణంగా చాలా ప్రాంతాలకు ముంపునకు గురయ్యాయి. స్థానికులు నీట మునిగిన భవనాల పైకప్పులపై ఆశ్రయం పొందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రధాని క్రిస్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఎమర్జెన్సీ ప్రకటించడం న్యూజిలాండ్ చరిత్రలో ఇది మూడవసారి. కాగా ఎడతెరిపిలే కుండా కుండపోత కురవడం, వరదలు సంభవించడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వాతావరణ విభాగాధికారులు వెల్లడించారు. ఆక్లాండ్‌కు 100కిమీలు ఈశాన్యంలో తుపాను కేంద్రం ఉన్నట్లు వెల్లడించారు. తీర ప్రాంతాలను ఖాళీ చేయించామని అధికారులు అన్నారు. లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా వారంతా అంధకారంలో చిక్కుకుపోయారని, అనేక రోడ్లు దెబ్బతిన్నాయని, కొన్ని ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయని, భారీ వృక్షాలు విరిగిపడ్డాయని చెప్పారు. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయన్నారు. 'దేశమంతటా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. తుపాను వల్ల భారీగా నష్టం జరిగింది. అనేకమంది అంధకారంలో చిక్కుకుపోయారు. చాలా కుటుంబాలు నిర్వాసితులుగా ఉన్నట్లు ఎమర్జెన్సీని ప్రకటించిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ప్రధాని అన్నారు. తమ ప్రభుత్వం సహాయక చర్యలను చేపడుతోందని, నిర్వాసితులకు సాధ్యమైనంత చేయూత అందిస్తోందని చెప్పారు.

గ్రీస్‌లో పింఛన్‌దారుల భారీ ర్యాలీ

ఏథెన్స్: గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో అట్టికా పింఛనర్లు కదంతొక్కారు. రోడ్లపైకొచ్చి నిరసన గళాన్ని వినిపించారు. పింఛన్ సంస్థల విలీనానికి ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ ఆర్థిక మంత్రి క్రిస్టోస్ స్టాయికౌరస్‌కు మెమోరాండం అందజేశారు. తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఏథెన్స్‌తో పాటు తెస్సాలోనికీలోనూ పింఛనర్లు భారీ ర్యాలీలు నిర్వహించారు. అన్ని పింఛన్లను పెంచాలని, దివ్యాంగులకు జాతీయ పింఛన్ అమలు చేయాలని డిమాండు చేశారు. 2016కి ముందు బీమాదారులకు సమాంతర బీమా ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరారు. ఆరోగ్య విత్‌హోల్డింగ్- ఈఏఎస్ సంఘీభావ లెవీ రద్దు చేయాలని, ఉచిత ఆరోగ్యం, వైద్య సంరక్షణ, సామాజిక భద్రతా కోసం డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం థెస్సాలోనికిలో వెనిజులోస్ విగ్రహం వద్ద జరిగిన భారీ ధర్నాలో వందలాది మంది పింఛన్‌దారులు పాల్గొన్నారు.

'నాటో హంతకులు తిరిగెళ్లండి'

గ్రీస్-అమెరికా సైనిక విన్యాసాలకు వ్యతిరేకంగా కేకేఈ నినాదం

ఏథెన్స్: అమెరికా, గ్రీస్ సంయుక్తంగా నిర్వహించిన సైనిక విన్యాశాలకు వ్యతిరేకంగా గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఉత్త గ్రీస్‌లోని ఝాంథీలో ఆందోళన నిర్వహించింది. సామ్రాజ్యవాద యుద్ధంలో దేశం పాలుపంచుకోవడాన్ని వ్యతిరేకించింది.

నాటో దళాలు తమ గడ్డపై ఉండటాన్ని నిరసించింది. 'నాటో హంతకులు తిరిగి వెళ్లండి' అంటూ కేకేఈ సభ్యులు, మద్దతుదారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. పెట్రోచోరి వద్దకు చేరుకున్న నిరసనకారులు సైనిక విన్యాశాలను 'థ్రాసియన్ కోఆపరేషన్ 23'గా వర్ణించారు. ప్రదర్శనను ఉద్దేశించి కేకేఈ కార్యదర్శి డియోనిసిస్ క్లాడిస్ మాట్లాడారు. థ్రాస్‌లోకి నాటో సామ్రాజ్యవాదులకు ప్రవేశం లేదని, యుద్ధంలో జోక్యమొద్దని గ్రీస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈనెల 4న కూడా పిరాయస్ (గ్రీస్‌లోని అతిపెద్ద పోర్టు)లో జార్జ్ డబ్ల్యూ బుష్ నౌకను నిలిపివుంచటానికి నిరసనగా కేకేఈ-కేఎన్ఈ సంయుక్తంగా ఆందోళన చేయడం విదితమే.

గుంతకల్లులో ఇద్దరి దారుణ హత్య

విశాలాంధ్ర-గుంతకల్లు : అనంతపురం జిల్లా గుంతకల్లు ఇద్దరు హత్యకు గురయ్యారు. పట్టణంలోని 60 అడుగుల రోడ్డు సమీపంలో ఉన్న ల్యాండ్ లార్డ్ హేమ కోటిరెడ్డి (65) తోపాటు ఆయన కారు డ్రైవర్ షేక్షావలి(25) ని దుండగులు దారుణంగా హత్య చేశారు. మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి సోఫాలో కూర్చున్న హేమాకోటి రెడ్డి గొంతును పదునైన చాకుతో కోసి పరారు అవుతుండగా అక్కడే ఉన్న ఆయన కారు డ్రైవర్ షేక్షావలి దుండగులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో షేక్షావలి కుడివైపు పొట్టలోకి కత్తితో పొడిచిన ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో అక్కడక్కడే షేక్షావలి కూడా మృతి చెందాడు. హుటాహుటిన సంఘటనా స్థలానికి గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, ఒకటో పట్టణ సీఐ రామసుబ్బయ్య, టూ టౌన్ సీఐ గణేష్ చేరుకొని కేసు విచారణ చేపట్టారు. కోటిరెడ్డి ఇంట్లో పని చేస్తున్న వహీదాను పోలీసులు విచారించారు. కొందరు వ్యక్తులు వచ్చి పత్రాలపై సంతకాలు పెట్టాలని కోటిరెడ్డిని అడిగారని, అందుకు కోటిరెడ్డి నిరాకరించడంతో ఆయనను గొంతు కోసి చంపినట్లు తెలిపింది. గతం నుంచి కోటిరెడ్డికి సంబంధించిన ఆస్తి తగాదాలు దీనికి కారణమైనట్లు స్థానికుల సమాచారం. హేమాకోటి రెడ్డి హత్య వార్త తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. హేమాకోటిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అందరితో మంచిగా మెలిగే హేమాకోటిరెడ్డి పై ఇలాంటి దారుణం చోటు చేసుకోవడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని కోరారు.

త్రిపురలో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

60 మంది సభ్యుల శాసనసభకు రేపు పోలింగ్

అగర్తల : త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు హై-వోల్టేజి ప్రచారం మంగళవారం ముగిసిందని ఎన్నికల సంఘం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 60 మంది సభ్యుల అసెంబ్లీకి ఫిబ్రవరి 16న పోలింగ్ నిర్వహించి మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. 'అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు పెద్దగా శాంతిభద్రతల సమస్య లేకుండా ముగిసింది. ఫిబ్రవరి 16న ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం సన్నద్ధమైంది' అని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) గిట్టే కిరణ్‌కుమార్ దినకరరావు పీటీఐకి తెలిపారు. 3,328 బూత్‌లలో పోలింగ్ జరుగుతుందని, వాటిలో 1,100 సున్నితమైనవి, 28 సమస్యాత్మకమైనవిగా వర్గీకరించినట్లు వివరించారు. నెల రోజుల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, డజను మంది కేంద్ర మంత్రులు కాషాయ పార్టీ అభ్యర్థులకు ప్రచారం చేశారు. బీజేపీ 'విజయ్ సంకల్ప్ యాత్ర, ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించింది. మరోవైపు, సీపీఎం నేత సీతారాం ఏచూరి, సీనియర్ నాయకులు ప్రకాశ్ కారత్, బృందా కారత్, మహ్మద్ సలీంలతో పాటు మాజీ సీఎం మాణిక్ సర్కార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి పార్టీకి ప్రచారం నిర్వహించారు. ఇక కాంగ్రెస్ నాయకులు అధీర్ చౌదరి, దీపా దాస్ మున్షి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ పార్టీ కోసం ప్రచారం చేశారు. అయితే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ప్రచారం కోసం రాష్ట్రానికి రాలేదు. మాజీ రాజకీయ వారసుడు ప్రద్యోత్ కిషోర్ మాణిక్య దెబ్బర్మ తన తిప్రా మోత పార్టీ కోసం ఒంటరిగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ గత ఐదేళ్లలో ఈశాన్య రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఎత్తిచూపగా, వామపక్ష కూటమి, కాంగ్రెస్... బీజేపీ-ఐపీఎఫ్‌టీ ప్రభుత్వ 'దుష్పరిపాలన' గురించి నొక్కి చెప్పాయి. కాగా 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రాంతీయ రాజకీయ పార్టీ అయిన తిప్రా మోత, గ్రేటర్ తిప్రాలాండ్ రాష్ట్ర హోదా డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఇదిలాఉండగా, ఎన్నికల రేసులో మొత్తం 259 మంది అభ్యర్థులు ఉండగా, వారిలో 20 మంది మహిళలు ఉన్నారు. బీజేపీ 55 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుండగా, దాని మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీ ఆరు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, ఒక స్థానంలో స్నేహపూర్వక పోరు సాగనుంది. సీపీఎం 47 స్థానాల్లో, కాంగ్రెస్ 13 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. బీజేపీ 55 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుండగా, దాని మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీ ఆరు స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, ఒక స్థానంలో స్నేహపూర్వక పోరు సాగనుంది. సీపీఎం 47 స్థానాల్లో, కాంగ్రెస్ 13 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ 28 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, 58 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉన్నారు. అధికార బీజేపీ అత్యధికంగా 12 మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టింది. ఫిబ్రవరి 16న 28.13 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులు.

సీపీఎస్ రద్దు హామీని నెరవేర్చాలి

సీఎస్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు హామీ నిలబెట్టుకోవాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి విన్నవించింది. విజయవాడ ఏపీ ఎన్జీవో హోమ్‌లో సమితి కార్యనిర్వాహక వర్గ సమావేశం మంగళవారం చైర్మన్ బండి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. దీనికి జేఏసీ కో-చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.తిమ్మన్న, జేఏసీ సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు, ఉద్యోగ సంఘాల నేతలు హాజరయ్యారు. అనంతరం ఏపీ సచివాలయంలో సీఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఏపీజీఏ, డీఏ బకాయిలు చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎస్ఐ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కారుణ్య నియామకాల నిబంధనలు సడలించి కరోనాతోపాటు సాధారణ మరణాలు పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని, నూతన జిల్లా ప్రధాన కేంద్రాల్లో 16శాతం హెచ్ఆర్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు ఏకకాలంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కేఎస్ఎస్ ప్రసాద్, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కేవీ శివారెడ్డి, జేఏసీ నాయకులు హరినాథ్, బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పూర్తిలో విఫలం

(మొదటిపేజీ తరువాయి)



కేంద్రమైన ఆలూరు పట్టణంలో వైసీపీ నేతలు కబ్జా చేసిన పొలాలను సీపీఐ బృందం పరశీలించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కబ్జాలపై పత్రికలలో వార్తలు రాస్తే వారిపై దాడులు చేస్తామని హెచ్చరించడం, బోరగడ్డ అనిల్‌కుమార్ బండికి కట్టుకొని పోతామని బెదిరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని జరుగుతున్నా జగన్‌మోహన్‌రెడ్డి తమాష చూస్తున్నారన్నారు. చెరువు కబ్జాపై కాకుండా అలూరు అభివృద్ధిపై దృష్టి మంత్రి మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టి సారించాలన్నారు. వేదవతి నది పూర్తి చేస్తే చరిత్రలో నిలిచిపోతావన్నారు. పాత్రికే యులు, పత్రికా యాజమాన్యం జోలికి పోతే భూస్థాపితం అవుతారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నదని, జీఓ నెం-1 తెచ్చిందని, ప్రతిపక్షాలను మాట్లాడనివ్వడం లేదన్నారు. అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాల సీపీఐ కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రజాసంఘాలనాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టోకు ధరల ద్రవ్యోల్బణం 4.73 శాతం

న్యూదిల్లీ : ఆహార వస్తువులు ఖరీదైనప్పటికీ, తయారు చేసిన వస్తువులు, ఇంధనం, విద్యుత్ ధరలను సడలించడం వల్ల టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 2 సంవత్సరాల కనిష్ఠ స్థాయి 4.73 శాతానికి క్షీణించింది. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రేటులో ఇది వరుసగా ఎనిమిది నెలల క్షీణత. 2022 డిసెంబర్‌లో ఇది 4.95 శాతం, గతేడాది జనవరిలో 13.68 శాతంగా ఉంది. 'జనవరి, 2023లో ద్రవ్యోల్బణం తగ్గుదల ప్రధానంగా ఖనిజ నూనెలు, రసాయన ఉత్పత్తులు, జౌళి, ముడి చమురు, సహజ వాయువు, ఆహార ఉత్పత్తుల కారణంగా ఉంది' అని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ధరల పెరుగుదల రేటులో తగ్గుదల ప్రధానంగా అనుకూలమైన మూల ప్రభావం కారణంగా ఉంది. ఆర్థిక వేత్త మాట్లాడుతూ ముందుకు సాగడం, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడం డబ్ల్యూపీవో ద్రవ్యోల్బణాన్ని మరింత తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. తయారు చేసిన వస్తువుల ద్రవ్యోల్బణం తగ్గినప్పటికీ, ఆహార వస్తువుల విషయానికి వస్తే డిసెంబరు 2022లో (-) 1.25 శాతం నుంచి జనవరిలో 2.38 శాతానికి పెరిగింది. జనవరి, 2023లో నూనె గింజల ద్రవ్యోల్బణం (-) 4.22 శాతం. పప్పు ధాన్యాల ద్రవ్యోల్బణం 2.41 శాతంగా ఉండగా, కూరగాయల్లో (-) 26.48 శాతంగా ఉంది. ఇక ఇంధనం, విద్యుత్ విషయంలో ద్రవ్యోల్బణం డిసెంబరులో 2022లో 18.09 శాతం నుంచి 15.15 శాతానికి తగ్గింది. తయారీ ఉత్పత్తులలో ఇది 2.99 శాతానికి, డిసెంబరులో 2022లో 3.37 శాతంగా ఉంది. డెలాయిట్ ఇండియాకు చెందిన ఆర్థిక వేత్త రుమ్కీ మజుందార్ మాట్లాడుతూ అధిక మూల ప్రభావం తగ్గుతున్న అంతర్జాతీయ ధరలు తయారీ ధరలను తగ్గించడంలో సహాయపడుతున్నాయని అన్నారు. 'సమీప భవిష్యత్తులో ఉత్పత్తి వ్యయం స్థిరంగా ఉంటుందని మేము ఆశిస్తున్నాము. పెరుగుతున్న ఆహార ధరలు ద్రవ్యోల్బణ సూచీని ఎక్కువగా ఉంచడం ఆందోళన కలిగిస్తోంది. అధిక ఆహార ధరలు కూడా అధిక వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) కు దోహదపడ్డాయి' అని మజుందార్ తెలిపారు. కాగా వచ్చే రెండు నెలల్లో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం మరింత తగ్గుముఖం పట్టవచ్చని, మార్చి నాటికి 4 శాతానికి చేరువయ్యే అవకాశం ఉందని బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రధాన ఆర్థిక వేత్త మదన్ సబ్నవిస్ తెలిపారు. జనవరి డబ్ల్యూపీఐలో తగ్గుదల సోమవారం విడుదల చేసిన రిటైల్ ద్రవ్యోల్బణం సమాచారానికి భిన్నంగా వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) లేదా రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు 2022లో 5.72 శాతం నుంచి జనవరిలో 6.52 శాతానికి పెరిగింది. కాగా గతవారం ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షలో పాలసీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది.

ఉమ్మడి లక్ష్యాల సాధనకు

మెరుగైన సహకారానికి పటిష్ఠ చర్యలు

ఐరాస: నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను సమర్థంగా పరిష్కరించేందుకు అంతర్జాతీయ సహకారాన్ని మెరుగుపర్చుకోవడం అవశ్యమని ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పిలుపునిచ్చారు. ఇందుకోసం కోసం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆయన ప్రపంచ దేశాలకకు సూచించారు. 2021 సెప్టెంబరులో ప్రారంభమైన 'మన ఉమ్మడి అజెండా'పై నివేదికను సమర్పించిన ఆయన సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు మరింత లోతుల్లోకి వెళ్లాలని అన్నారు. వాతావరణం, అసమానత్వం, ఆహార అభద్రత, అణ్వాయుధాల అంశాల్లో ప్రమాద అంచులకు చేరుకున్నామని చెప్పారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ అంతర్జాతీయ సయోధ్య తగిన విధంగా లేదన్నారు. సమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడం కోసం అనుసరించే విధానాలు- పనిచేసే యంత్రాంగాలలో సారూప్యత లోపిస్తోందని నొక్కిచెప్పారు. ఈ పరిస్థితి మారితేనే లక్ష్యాలను సాధించవచ్చునన్నారు.

విప్లవాత్మక సంస్కరణలు

(మొదటిపేజీ తరువాయి)

20 లక్షల పై చిలుకు రిజిస్ట్రేషన్లు, డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు ఫోన్‌ను ఐదు సార్లు షేక్ చేసినా, ఎస్ఓఎస్ బటన్ నొక్కినా చాలు... ఐదు, పదినిమిషాలలోపే పోలీసు సోదరుడు ఒక అన్నగా, తమ్ముడిగా వచ్చి సహాయం చేయడానికి స్పందిస్తున్నారని, ఇలా ఇప్పటివరకు దాదాపు 6 వేల మందికి సహాయం లభించిందని సీఎం వివరించారు. ఇటువంటి మార్పుల్లో భాగంగానే ఇవాళ 20 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో టూరిస్ట్‌ల భద్రత కోసం పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. టూరిస్ట్‌ల భద్రతే లక్ష్యంగా మొత్తం 20 ప్రాంతాలను గుర్తించి అక్కడ కియోస్కులు ఏర్పాటు చేశాం. ఆ కియోస్క్‌లన్నీ స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమై, 20 అదనపు పోలీస్ స్టేషన్‌లుగా పని చేస్తాయి. ప్రతి కియోస్క్‌లోనూ దాదాపుగా 6 మంది సిబ్బంది రెండు షిఫ్టులలో పనిచేసే విధంగా రూపకల్పన చేశారు. వీరిని ఎస్ఐ లేదా ఏఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఎవరైనా ఆపదలో ఉంటే వారి కోసం ప్రత్యేకంగా టెలిఫోన్ నంబరు డిస్‌ప్లే చేయడం జరుగుతుంది. అదే విధంగా ఆ ప్రదేశంలో ఎవరికైనా ఆపద వస్తే... దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే పోలీసు సోదరుడు మీకు తోడుగా నిలబడినట్టే అన్న భావన కల్పించే విధంగా కరపత్రాలు కూడా ఆ ప్రాంతంలో అందుబాటులోకి తీసుకుని వస్తున్నాం. వీరందరికీ ప్రత్యేకమైన టెలిఫోన్ నంబరు, రేడియో సెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఆ ప్రాంతానికి సంబంధించిన మ్యాపు, అత్యవసర టెలిఫోన్ నంబర్లు, వాహనాలు ఇచ్చి ఆ ప్రాంతంలో ఉన్న పర్యాటకులు, యాత్రికులు నిర్భయంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న సిబ్బందిలో సగం మంది మహిళలు ఉన్నారు. దీనివల్ల ఎవరైనా మహిళలు ఆ కియోస్క్‌లకు వెళ్లినప్పుడు వారికి మహిళా సిబ్బంది తోడుగా నిలబడతారు. ఈ పోలీస్ స్టేషన్లో పని చేసే వారు అంకిత భావంతో, సేవా భావంతో పని చేయడం ద్వారా, పోలీస్ శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ మంత్రి తానేటి వనిత, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలకు నరేగానా ?

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయ నిర్మాణాలకు నరేగా నిధులు ఎలా వినియోగించారని హైకోర్టు ప్రశ్నించింది. నరేగా నిధుల వినియోగానికి కేంద్రం అనుమతి ఇచ్చిందా ? కనీసం దీనిపై కేంద్రగ్రామీణాభివృద్ధి శాఖకు లేఖ అయినా రాశారా? అని జస్టిస్ భట్టు దేవానంద్ ప్రశ్నలు సంధించారు.

దీనిపై రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు కోర్టు వాయిదా వేసింది.

జగన్ దిగిపోయే నాటికి

రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పు

- ఒక్క ప్రాజెక్టు కట్టావా లేక ఒక్క పరిశ్రమ నిర్మించావా?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-గుంతకల్లు: ముఖ్యమంత్రి జగన్ దిగిపోయే నాటికి రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పులు ఉంటాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర బృందం పర్యటనలో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతి నెల జోలి పట్టుకుని అప్పులు చేయడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని అప్పుల మంత్రిగా చెప్పవచ్చని, ఆయన ప్రతి నెల అప్పుల కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ దిగిపోయే నాటికి రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పులు ఉంటాయని అంచనా వేశారు. ఇన్ని అప్పులు చేసి రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు కట్టావా లేక ఒక పరిశ్రమ అయినా నిర్మించావా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. 10 రోజులు దాటినా జీతాలు ఇవ్వలేక పోతున్నారని విమర్శించారు. పైగా వైసీపీ పాలకులు నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని, ఎమ్మెల్సీ, టీచర్లు, పట్టభద్రుల ఎన్నికల్లో జోక్యం చేసుకుని అప్పుడే బెదిరింపులు, డబ్బు పంపకాలు చేస్తున్నారని అన్నారు. కర్ణాటకలో జరిగే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇస్తే, సీఎం జగన్ నుంచి ఎటువంటి స్పందనా లేదని అన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఆంధ్ర ప్రదేశ్‌లో సాగు, తాగునీటి కష్టాలు వస్తాయని తమ పర్యటనలో తేలిందని రామకృష్ణ చెప్పారు. ఏపీలో సాగునీటి కేటాయింపులు సక్రమంగా జరగక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. హంద్రీ-నీవా కాలువకు సమాంతరంగా కాలువ నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, గుండ్లకమ్మ, వేదవతి, సిద్దేశ్వరం, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుల పర్యటన తరువాత కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో చర్చించి కేంద్ర జనవనరుల శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలను అందజేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కళ్లకు గంతులు కట్టుకొని చూస్తూ ఉండిపోయిందని అన్నారు. పార్లమెంటులో ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించి ఉంటే అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిగేది కాదని తెలిపారు. రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం ప్రజలకు తుంగభద్ర నీరు రాకుండా పోతే ఎడారి ప్రాంతంగా మారే పరిస్థితి ఉందన్నారు. రాయలసీమ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని విమర్శించారు. ఇప్పటికైనా అప్పర్ భద్ర ప్రాజెక్టు అమలును ఉపసహరించుకోకపోతే అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, హరినాథ రెడ్డి, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, రామచంద్రయ్య, రాష్ట్ర నాయకులు గిడ్డయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి శేఖర్, రైతు సంఘం నాయకులు కాటమయ్య, అనంతపురం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బి.గోవిందు, రాష్ట్ర నాయకులు లెనిన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్'పై అఖిలపక్ష సమావేశం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యా విధానంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష పార్టీలు, రైతు సంఘాలతో సమావేశం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ మంగళవారం డిమాండ్ చేశారు. జాతీయ విద్యుత్ విధానం వల్ల రాష్ట్రాలపై తీవ్రభారం పడుతుందని, వ్యవసాయానికి అందించే ఉచిత విద్యుత్, పేద వర్గాలకిచ్చే రాయితీలకు మంగళం పాడే స్థితి నెలకొనే ప్రమాదముందన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)లకు రాయితీపై అందించే విద్యుత్ వినియోగానికి ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలని గడువులోగా చెల్లింపులు జరగకుంటే డిస్కమ్‌లు, విద్యుత్ సరఫరా నిలిపివేయాలని కేంద్రం స్పష్టం చేసిందని వివరించారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్నాయని, అదేవిధంగా 200 యూనిట్లులోపు విద్యుత్ వినియోగించేందుకు ఎస్సీ, ఎస్టీలకు క్షౌర శాలలు, దోబీ ఘాట్‌లకు ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర విద్యుత్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై భారం పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వాలు డిస్కమ్‌లకు చెల్లించే సొమ్ము సకాలంలో చెల్లించకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తే వ్యవసాయరంగానికి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారన్నారు. రాయితీపొందే వినియోగదారులకు ఎన్ని యూనిట్లు విద్యుత్ సరఫరా చేశారనే గణాంకాలు తీసేందుకు మీటర్లు బిగించాలనే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రం రూపొందించిన విద్యుత్ విధాన ముసాయిదాపైచర్చించేందుకు తక్షణం అఖిలపక్ష పార్టీలు, రైతుసంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

అది 'జోకేశ్' యాత్ర : రోజా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో నారా లోకేశ్ చేస్తున్నది పాదయాత్ర కాదు జోకేశ్ యాత్రని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. ఆమె మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ అవినీతికి కేరాఫ్‌గా నారా కుటుంబం ఉదన్నారు. రెండెకరాల చంద్రబాబు వేలకోట్లకు అధిపతి ఎలా అయ్యారని ప్రశ్నించారు. మీ ఆస్తులపై సీబీఐతో విచారణకు సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. లోకేశ్ ఓ ఐరెన్ లెగ్ అని, ఆయన యాత్రలో జై జగనన్న నినాదాలు వినిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. లోకేశ్ అడుగుపెట్టినప్పటి నుంచి రాష్ట్రానికి, ఎన్టీఆర్ కుటుంబానికి ఏదొక అరిష్టం జరుగుతూనే ఉందని ఎద్దేవా చేశారు.

లోకేశ్ సింబల్ అదే: వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిది శివంకర్: లోకేశ్ ప్రవర్తన అధ్వాన్నంగా ఉందనీ, ఆయన పాదయాత్రకు జనం రావడం లేదని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ విమర్శించారు. తెలుగువారి ఆత్మగౌరవమంటూ చేతిని సూటిగా ఎన్టీఆర్ చూపించగా, చంద్రబాబు రెండువేళ్లూ ఊపేవారని, ఇప్పుడు లోకేశ్ చేయి చూపిన విధానం బాత్‌రూమ్‌కు వెళ్లొస్తా అన్నట్లుగా ఉందని తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన విమర్శించారు.

వ్యవసాయంపై కేంద్రం చిన్నచూపు

కేంద్ర బడ్జెట్లో ఏపీకి మొండిచెయ్యి

సీపీ ఫౌండేషన్ సెమినార్‌లో జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తక్కువ కేటాయిం చారని వ్యవసాయ రంగంపై చిన్నచూపు చూశారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి విమర్శించారు మంగళ వారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం, అదానిస్కాం- దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అనే అంశాలపై పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ అధ్యక్షతన సెమినార్ జరిగింది తొలుత ప్రభాకర్ చౌదరి చిత్రపటానికి పార్టీ, ప్రజా సంఘాల నేతలు సానుభూతిపరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీ సత్యనారాయణ మూర్తి ప్రసంగాన్ని కొనసాగిస్తూ జాతీ సంపదను సక్రమంగా విభజించటం లేదని దానితో 30 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోదీ బడ్జెట్‌లో ఘోరంగా కోతలు విధించారని తెలిపారు. రైతులకు ఇచ్చే సబ్సిడీ తగ్గించారని దీంతో వ్యవసాయరంగం మరింత సంక్షోభంలో వెళ్తుందని, రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగే దుర్భర పరిస్థితిని మోదీ తీసుకొస్తున్నారని చెప్పారు ఏ దేశమైనా విద్యా, వైద్య రంగంపై దృష్టి పెడతాయని మోదీ మాత్రం ఈ రెండింటికి నిధులు బాగా తగ్గించారని చెప్పారు. విద్యకు 2.9% నిధులు కేటాయించడం దారుణం అన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పోలవరం ప్రాజెక్టు ప్రధానమైందని అటువంటి ప్రాజెక్టుపై మోదీ, జగన్ ఇద్దరు పోలవరం ప్రాజెక్టుకు తూట్లు పొడుస్తున్నారని చెప్పారు పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాజకీయంగా లబ్ధి చేకూరుతుందనుకుంటేనే నిధులు కేటాయిస్తు న్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రానికి అన్యాయంపై కేంద్ర ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధంగా లేరనీ, దానివల్లే ఈ బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారన్నారు అదాని స్కాంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా, పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న ఇప్పటివరకు మోదీ నోరు మెదపలేదని ఒక నాణానికి బొమ్మ బొరుసు మోదీ, అదాని అని అన్నారు రాష్ట్ర ప్రజానీకం చైతన్యవంతంగా ఆలోచించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి సన్నద్ధం కావాలని జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. సీపీ ఫౌండేషన్ అధ్యక్షులు తాటిపాక మధు, కార్యదర్శి కుంద్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు, నగర ప్రముఖులు బుట్టల రెడ్డి ,నర్వ గోపాలకృష్ణ , బొడ్డు బుల్లబ్బాయి, సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాము, మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి లోవరత్నం తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్, అదానీ అవినీతికి నిరసనగా

24న ధర్నాలు, ప్రదర్శనలు

సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు, ప్రజలపై అదనపు భారాలు, అదానీ అవినీతికి నిరసనగా ఈ నెల 24వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఈ నెల 12, 13 తేదీల్లో వై.వెంకటేశ్వరరావు అధ్య క్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం వివిధ ప్రజాసమస్యలపై చర్చిం చింది. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబీ హాజరయ్యారు. సమావేశం వివరాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీని వాసరావు మంగళవారం వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించిందని, ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచిందనీ, పెరిగిన ధరలు, ఎరువులు అందక రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని సమావేశం పేర్కొంది. అప్పులు రెట్టింపు అయ్యాయని, ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేశారని, ప్రత్యేకహోదా నిరాకరించడంతోపాటు విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదనీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు నామకా నిధులు విడుదల చేశారని తెలిపింది. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తల వంపులు తెచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని అదానీపరం చేయడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండించింది.

పీటీడీ-ఆర్టీసీ ఉద్యోగులకు సీఎస్ హామీ

ఎంప్లాయీస్ యూనియన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీటీడీ-ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఏపీ పీటీడీ-ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ తెలిపింది. ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను సీఎస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వైవీరావు, పలిశెట్టి దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో 11వ పీఆర్సీ అమలు జరిగినప్పటికీ, అప్పటికే పదోన్నతులు పొందిన 2096 మంది ఉద్యోగులకు ప్రభుత్వం అనుమతి లేకుండా, ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చారని గుర్తుచేశారు. ఇంతవరకు 11వ పీఆర్సీ అమలు చేయలేదని, ఆర్టీసీలో విలీనం కాకముందున్న ఆర్టీసీ సర్వీస్ రూల్సునే వర్తింపజేయాలని, పాత పద్ధతిలో వైద్యసౌకర్యాలు రిఫరల్ ఆసు పత్రులద్వారా అందించాలన్నారు. ముఖ హాజరు నుంచి ఆర్టీసీ సిబ్బందికి మినహాయిం పునివ్వాలని, అతి తక్కువ పెన్షన్ పొందుతున్న పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లను సీఎస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని వైవీరావు, దామోదరరావు తెలిపారు.

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని మహిళల భద్రత, రక్షణకు వైసీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. మంగళవారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయ పబ్లిసిటీ సెల్‌లో హోంమంత్రి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఓ అంధ బాలికపై నేరచరిత్ర ఉన్న వ్యక్తి దాడిచేసి హత్యచేయడం ఎంతో దురదృష్టకరమని చెప్పారు. మద్యం మత్తులోనే నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని, గంజాయి మత్తు ఇందుకు ఏ మాత్రమూ కారణం కాబోదన్నారు. వ్యక్తిగత వివాదాలే ఈ హత్యకు కారణమని ఆమె వివరించారు. ఈ దుర్ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించడం వల్ల నిందితుడిని ఒక గంటలోపే పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించారన్నారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని సీఎం జగన్ వెంటనే ప్రకటించారని తెలిపారు. దురదృష్టకర సంఘటనను ఆధారంగా చేసుకుని ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని కొట్టిపారేశారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళల భద్రతకు, రక్షణకు, సాధికారతకు అధిక ప్రాధాన్యత నిస్తూ వినూత్న కార్యక్రమాలను, పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు 1.30కోట్ల మంది మహిళలు దిశ యాప్‌ను తమ స్మార్టు ఫోన్లలోకి డౌన్‌లోడ్ చేసుకున్నారని, 900 మందికిపైగా మహిళలు ఈ యాప్ ద్వారా రక్షణ పొందారని పేర్కొన్నారు. తప్పు ఎవరు చేసినా...ఎలాంటి వారు చేసినా పక్షపాతం చూపకుండా 24 గంటల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్, జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని అమల్లోకి తేవడంతోపాటు తాజాగా టూరిస్టు పోలీస్ స్టేషన్లనూ సీఎం జగన్ ప్రారంభించారని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల భద్రత, రక్షణకు ఈ టూరిస్టు పోలీస్ స్టేషన్లు ఎంతో దోహదపడతాయని ఆమె తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై జగనన్న ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని, రెండు లక్షల కేజీల గంజాయిని పట్టుకోవడంతోపాటు ఏజెన్సీలలో గంజాయి సాగును పూర్తిగా నియంత్రించారని వివరించారు. గంజాయి సాగుపై ఆధారపడిన గిరిజన రైతులను ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసుకునేలా మళ్లించారన్నారు. నాటు సారా తయారీని పూర్తిగా నియంత్రించారని, అందుకోసం అధిక మొత్తంలో బెల్లం వ్యాపార చేసే వారిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకులకు ఏదో విధంగా ఆరోపణలు చేయడమే పరిపాటిగా మారిందన్నారు. గతంలో వారి హయాంలో మహిళలకు ఏమాత్రం భద్రత లేకపోవడంతోపాటు దోషులకు శిక్షలు పడకుండా కొమ్ముకాసేవారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో లేవని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, డీజీ త్రివిక్రమ వర్మ, ఎస్పీ అనిల్ పులిపాటి పాల్గొన్నారు.

అంధ బాలిక హత్య కేసులో నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ కట్టపై ఆదివారం రాత్రి జరిగిన 17 ఏళ్ల అంధ బాలిక ఎస్తేరు రాణి హత్య కేసులో నిందితుడు నాగపోగు దయానందరాజు అలియాస్ కుక్కల రాజును పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడ్ని తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు. ముద్దాయి రాజు తన ఇంటికి ఎదురుగా ఉండే హతురాలి పట్ల ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని మృతురాలు ఎస్తేరు రాణి కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో కక్ష పెంచుకుని ఎస్తేరు రాణిపై కత్తితో దాడి చేశాడన్నారు. తీవ్రంగా గాయపడిన ఎస్తేరు రాణిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి



కుటుంబ సభ్యులు, స్థానికులు తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని వివరించారు.మద్యం మత్తులోనే రాజు ఈ హత్యకు పాల్పడ్డాడని స్పష్టం చేశారు. రాజు గంజాయి సేవించినట్లు, అతడిపై రౌడీ షీట్ ఉన్నట్లు మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదన్నారు. నిందుతుడిపై ఎటువంటి రౌడీ షీట్ లేదని, గతంలో హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటనలో ఒక కేసు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సుప్రజ, డీఎస్పీ రాంబాబు, సీఐ శేషగిరిరావు, ఎస్సైలు నారాయణ, వినోద్ పాల్గొన్నారు.

ప్రకాశంలో భూ ప్రకంపనలు

విశాలాంధ్ర-ముండ్లమూరు: ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలంలోని ముండ్లమూరు, పూరిమెట్ల, భీమవరం, ఉమా మహేశ్వరం, తమ్మలూరు గ్రామాలలో భూమి స్వల్పంగా కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ఏమి జరుగుతుందో తెలియక గందరగోళానికి గురయ్యారు. మంగళవారం సాయంత్రం 6.30కు ఒకసారి, ఆపై 6:45కు మరోసి భూమి కంపించిందని, శబ్దాలు రావడంతో భయాందోళనకు గురైనట్లు స్థానికులు తెలిపారు.

వేగంగా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం

దిల్లీలో పనులను పరిశీలించిన మంత్రుల బృందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/దిల్లీ: విజ యవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేయనున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మానం పనులు దిల్లీలో శరవేగంగా సాగుతు న్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు. విగ్రహ నిర్మాణ పనుల్లో ఎక్కడా ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుం టున్న నేపథ్యంలో అనుకున్న ట్లుగానే ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాడు విగ్రహావిష్కరణ చేపడతామని పునరుద్ఘాటిం చారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిం చడానికి అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ మేరుగు నాగార్జున అధ్వర్యంలో నలుగురు మంత్రుల బృందం మంగళవారం దిల్లీలోని స్టూడియోను సందర్శించింది. మంత్రి నాగార్జునతోపాటు ఉపముఖ్యమంత్రి (దేవాదాయశాఖ) కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ రాబోయే అంబేద్కర్ జయంతి రోజున ఈ విగ్రహాన్ని ఆవిష్కరించాలని సీఎం జగన్ పట్టుదలతో ఉన్నారని, విగ్రహ నిర్మాణ పనులను మంత్రులతో పాటు జగన్ స్వయంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. ఇక విజయవాడ స్వరాజ్య మైదాన్‌లో రూ.268 కోట్లతో నిర్మించాలనుకున్న అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ వ్యయం మరింతగా పెరిగే అవకాశ ముందని, ఖర్చు ఎంతగా పెరిగినప్పటికీ స్మృతివనం పనుల్లో ఎక్కడా ఆలస్యం జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని చెప్పారు.

ఆంధ్రావనికి నలుదిక్కులా అవకాశాలు

- త్వరలో 'ఇన్ లాండ్ వాటర్ వే పాలసీ' తీసుకువస్తాం
- విశ్వనగరంగా విశాఖపట్నం అభివృద్ధి
- 3 కారిడార్లను అభివృద్ధి చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ
- బెంగళూరు పారిశ్రామిక సదస్సులో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌కు నలుదిక్కులా పుష్కలంగా వనరులున్నాయని, ప్రభుత్వం కూడా అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోపల, వెలుపలా రవాణా ఖర్చు తగ్గించేందుకు 'ఇన్ లాండ్ వాటర్ వే పాలసీ'ని తీసుకురానున్నట్లు చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే 27 ప్రాంతాలను గుర్తించా మన్నారు. 2029 కల్లా 10 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్వహించేలా ముందుకెళుతున్నట్లు మంత్రి వివరించారు. 26 నైపుణ్య కళాశాలల అభివృద్ధి దిశగా అడుగులు పడ్డాయని మంత్రి తెలిపారు. బెంగళూరులోని ఐటీసీ హోటల్ వేదికగా మంగళవారం జరిగిన ఇండస్ట్రియల్ మీట్‌లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పాల్గొని సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. మౌలిక సదుపాయాలు, మానవ వనరులే పెట్టుబడులకు పునాది అని అన్నారు. విశాఖ లాంటి ప్రాంతం ప్రపంచంలో ఎక్కడా దొరకదని, అదొక విశ్వనగరంగా అభివృద్ధి చెందనున్నట్లు వెల్లడించారు. అన్ని రంగాలకు, అన్ని రకాల పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌లో అవకాశాలున్నాయన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి ప్రగతిలో దూసుకెళుతుందన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రధానంగా విద్య, నైపుణ్యం, గృహ నిర్మాణం, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమల హబ్‌లుగా ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి ప్రధాన నగరాలు తయారు కాగా, సామాజిక, ఆర్థిక, పర్యావరణ ప్రమాణాల ఆధారంగా నీతి ఆయోగ్ ప్రకటించిన అనువైన వాతావరణం ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ది నాలుగో స్థానమని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన విస్తారమైన ల్యాండ్ బ్యాంక్ ఏపీ సొంతమన్నారు. ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ పార్కును అభివృద్ధి చేస్తోందన్నారు. దక్షిణ భారతదేశంలో రూ.వెయ్యి కోట్ల తోడ్పాటుతో పార్కును దక్కించుకున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. అలాగే ఒకేసారి 3 కారిడార్లను అభివృద్ధి చేస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఏపీ ప్రత్యేకతను వివరించారు. బల్లారిలో చిరుద్యోగి స్థాయి నుంచి వేలాది మందికి ఉపాధినిచ్చే పారిశ్రామిక వేత్తగా ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి ఎదిగిన తీరు ఆసక్తికరమని మంత్రి మెచ్చుకున్నారు. బెంగళూరులో జరిగిన పారిశ్రామిక సదస్సుకు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత, ఐటీ, ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక కార్యదర్శి సుందర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శ్రీధర్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సరోగసీపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాజానికి ఎంతో కీలకంగా ఉన్న ప్రీ కన్సెప్షన్, ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ (పీసీపీఎన్ డీటీ), సరోగసీ చట్టాల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్‌లో ఉన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ప్రీ కన్సెప్షన్, ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ యాక్ట్ (పీసీపీఎన్ డీటీ), సరోగసీ, ఏఆర్టీ చట్టాల రాష్ట్రస్థాయి అమలు బోర్డుల సమావేశాలను నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు ఎలా జరుగుతున్నాయనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడ, మగా... ఎవరనే చెప్పే పరిస్థితులు ఎక్కడా ఉండటానికి వీల్లేదన్నారు. ఐవీఎఫ్, సరోగసి లాంటి ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్న ఆస్పత్రుల విషయంలో అధికారులు నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా సరోగసి లాంటి చికిత్సలు అందిస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న గైనకాలజిస్టుల సాయం తీసుకోవాలన్నారు. ఈ చట్టాల అమలు బోర్డులో సభ్యులుగా ఉన్న పాడేరు, తాడికొండ ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, శ్రీదేవితో పాటు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి తదితరులు ఈ సందర్భంగా వివిధ సూచనలు చేశారు. వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ మార్కు ప్రతీకారం

అడుగడుగునా ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని దయనీయస్థితిలో పడిపోయినప్పుడు కసిగా, నిష్కారణంగా, అడ్డంగా దాడికి దిగడం మోదీ వ్యవహార శైలి. తనను ప్రశ్నించే వారిని మోదీ ఏ మాత్రం సహించలేరు. విమర్శలను ఎదుర్కునే లక్షణం ఏ నియంతకూ ఉండదు. సరిగ్గా ఇరవైఏళ్ల కింద జరిగిన గుజరాత్ మారణకాండపై బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్(బి.బి.సి.) వరసగా రెండు వీడియోలు విడుదల చేసి మోదీని బోనెక్కించింది. ఆయనలో గూడు కట్టుకున్న మతతత్వాన్ని ఎండగట్టింది. సహజంగానే ఇది మోదీకి మింగుడు పడలేదు. రాజకీయ ప్రత్యర్థుల మీద ఆదాయపు పన్ను శాఖను, సీబీఐని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్(ఇ.డి.)ను ప్రయోగించిన, ప్రయోగిస్తున్న రీతిలోనే మంగళవారం ఉదయం నుంచి తనకు వ్యతిరేకంగా డాక్యుమెంటరీలు విడుదల చేసిన బీబీసీ మీద ఆదాయపు పన్ను శాఖ చేత దాడులు చేయించారు. మొదట ఈ డాక్యుమెంటరీలను ట్విట్టర్ లాంటి వేదికల మీద నిషేధించారు. ఈ సాంకేతిక యుగంలో ఇలాంటి నిషేధాలవల్ల ప్రయోజనం ఉండదని మోదీ అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. నిషేధం ఉన్నా అనేక మంది ఈ డాక్యుమెంటరీ చిత్రాలను చూశారు. చూడకూడదన్న హెచ్చరికలు పెచ్చరిల్లుతున్న కొద్దీ వీటిని సామూహికంగా చూడడం తమ హక్కు అని జనం భావించారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జె.ఎన్.యు), బెంగాల్‌లోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిషేధాన్ని ధిక్కరించి మోదీకి సవాలు విసిరారు. ఆ డాక్యుమెంటరీలలో ఉన్న వాస్తవం జనానికి తెలియక కాదు. ఇంతకు ముందే గుజరాత్ మారణకాండ మీద అనేక నివేదికలు వచ్చాయి. అవన్నీ మారణకాండకు అప్పుడు ముఖ్యమంత్రి స్థానంలోఉన్న మోదీ మద్దతిచ్చిన వైనాన్ని విప్పిచెప్పాయి. తాజాగా బీబీసీ విడుదల చేసిన రెండు డాక్యుమెంటరీలు ఆ కిరాతక పాలనకు నాయకత్వం వహించిన ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వలువలను నగ్నరూపాన్ని బట్టబయలు చేశాయి. ఇదంత అవమానకరమో మోదీ గ్రహించకుండా ఉండగలరా! మోదీ తొమ్మిదేళ్ల పాలనలో గోదీ మీడియా అంతా నిస్సిగ్గుగా మోదీకి మోకరిల్లింది. నిజాన్ని కప్పిపుచ్చే ఈ మీడియా బండారం బయట పెట్టడానికి శక్తి మేరకు ప్రయత్నిస్తున్న మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాలు చేయని ప్రయత్నం లేదు. కానీ గుత్త పెట్టుబడిదారుల గుప్పెట్లో ఉన్న మీడియా సంస్థలతో పోలిస్తే ప్రశ్నించే మీడియా సంస్థల గొంతు పీలగానే ఉంది. ఈ దశలో బి.బి.సి. అహం దెబ్బతిన్న మోదీ ఈ ఆరోపణలకు సమాధానం చెప్పే శక్తి లేనందువల్ల తన చేతిలో ఉన్న ప్రభుత్వ విభాగాలను బి.బి.సి. పైకి ఉసిగొల్పారు. ఇది ఆయనను ఆవహించిన భయావిహ్వలతకు చిహ్నం. ఢిల్లీలో బీబీసీ కార్యాలయం మీద దాడిచేసినవారు దాదాపు రెండు డజన్లు. ముంబైలోని బి.బి.సి. కార్యాలయం మీద దండెత్తిన వారు దాదాపు అంతే మంది. ముంబై వెళ్లిన అధికారులు అక్కడి వారు కాదు. ఢిల్లీ నుంచి వెళ్లారు. అంటే ఇదంతా ఒక పథకం ప్రకారమే జరిగిందని బధిరాంధులకు కూడా అర్థం అవుతుంది.

ఆదాయపు పన్నుశాఖ అధికారులు తాము చేసిన పనిని దాడి అనడం లేదు. దీనికి వారు పెట్టిన ముద్దు పేరు సర్వే. అదే నిజమైతే అక్కడ సిబ్బంది కంప్యూటర్లను, లాప్‌టాప్‌లను ఎందుకుస్వాధీనం చేసుకున్నట్టు! ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ఇలాంటి సందర్భాలలో ఏ పత్రాలనూ స్వాధీనం చేసుకోకూడదు. అక్కడ ఉన్న సమాచార నకళ్లు తీసుకోవచ్చు. ఇప్పుడు వ్యవహారం అంతా కంప్యూటర్ల ద్వారా కొనసాగుతుంది కనక దాడిచేసినచోట ఉన్న సమాచారం నకళ్లు సేకరించవచ్చు. కానీ ఆదాయపు పన్ను శాఖ ఏకంగా జప్తు చేసింది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవుండదుగా! ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై అధికారంలోకి వచ్చిన నియంతలూ రాజుల్లాగే నిరంకుశంగా వ్యవహరిస్తారు. మోదీ ఈ ధోరణికి ప్రతిరూపం. మోదీ సూత్రీకరణ ప్రకారం తన ప్రతిష్ఠకు భంగం కలగడం అంటే దేశ ప్రతిష్ఠకు భంగం కలగడమే. అయితే ప్రజాస్వామ్యం పరిఢవిల్లవలసిన చోట తాను నియంతృత్వం చెలాయిస్తుండడం దేశ ప్రతిష్ఠను దిగజారుస్తోందని మోదీ ససేమిరా అంగీకరించరు. ఆయన మూర్తీభవించిన అహంభావి. దెబ్బకు దెబ్బకు తీయడమే ఆయన విధానం. ఆయన నియంతృత్వ పోకడ కేవలం రాజకీయాలకే పరిమితం కాదు. తనను ప్రశ్నించే వారిని సహించే సంస్కారమూ ఆయనకు లేదు. అందుకే బి.బి.సి. మీద ఆదాయపు పన్ను శాఖను ప్రయోగించారు.

బీబీసీ ప్రపంచవ్యాప్తంగా చాలా విశ్వసనీయత ఉన్న వార్తా వ్యవస్థ. ప్రపంచమంతా 50 కోట్ల మంది బీబీసీ వార్తలను ఆదరిస్తారనుకుంటే అందులో భారతీయుల సంఖ్య ఏ దేశంలోనూ లేనట్టుగా ఆరున్నర కోట్ల దాకా ఉంది. బీబీసీలో ప్రసారమైందే నిఖార్సైన వార్త అన్న అభిప్రాయం ఇప్పటికీ మన దేశవాసుల్లో ఉంది. అలాంటి వార్తా వ్యవస్థ మోదీ కీర్తికి కళంకం కల్గిస్తే సహిస్తారా? ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభం అయిన తరవాత రష్యా బి.బి.సి. ప్రసారాలను అనుమతించడం లేదు. చైనాలోనూ అదే పరిస్థితి. అంటే తమ లోపాలు బయటకు పొక్కకూడదనుకునే వారు బి.బి.సి. ప్రసారాలకు కళ్లెం వేస్తున్నారు. మోదీ ఒక అడుగు ముందుకేసి ఏకంగా దాడి చేయించారు. బి.బి.సి. ఆదాయపు పన్ను ఎగవేస్తోందని, బ్లాక్ మెయిల్ చేస్తుందని, ఆ సంస్థ పత్రికా రచన వెనక ఒక నిర్దిష్ట ఎజెండా ఉందని ప్రచారం చేయడం మోదీ సర్కారు ఉద్దేశం. మోదీ సర్కారును మరో అంశం నిరంతరం వ్యాకులపరుస్తోంది. జి20 అధ్యక్ష స్థానం ఈ సారి భారతకు దక్కింది. ఇది మోదీకి ఏనుగెక్కినంత సంతోషం కలిగించింది.

ఈ ఏడాది పొడవునా జి20కి సంబంధించి సభలు, సమావేశాలు, సందర్శనలు మన దేశంలో జరగనున్నాయి. అలాంటప్పుడు బి.బి.సి. డాక్యుమెంటరీవల్ల ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశం మోదీకి బొత్తిగా మింగుడు పడడం లేదు. గోదీ మీడియా గీసిన మోదీ చిత్రం రాను రాను వికృతం అయిపోతుంది. డాక్యుమెంటరీల గొడవ సద్దు మణగక ముందే అదానీ కుంభకోణం, అందులో మోదీ సర్కారు పాత్ర ఉందన్న ఆరోపణలు మోదీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇవన్నీ అంతర్జాతీయంగా తనకు ఉండను కుంటున్న ఆదరణను ధ్వంసం చేస్తాయన్న బాధ మోదీని అమితంగా పీడిస్తోంది. బి.బి.సి.మీద ఉన్న అనుమానాలు ఆర్థిక సంబంధమైనవి అయితే ఆదాయపు పన్నుశాఖ ఆ మేరకే పరిమితం కాకుండా అక్కడ పనిచేసే సిబ్బంది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం మోదీ వెన్నులో పుట్టిన వణుకుకు సంకేతం. బలహీనం అవుతున్నవారు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినట్టే మోదీలో ప్రతీకారేచ్ఛ పెరుగుతోంది.

ఢిల్లీలో బుల్‌డోజర్ దాడి

గురుసిమ్రాన్ కౌర్ బక్షి

ఢిల్లీలో మళ్లీ బుల్ డోజర్ విధ్వంసం మొదలైంది. ఆక్రమణల పేరుతో వందలాది పేదల పాకలు, పెద్దపెద్ద భవనాలతో సహా కూలగొడుతున్నారు. దక్షిణ ఢిల్లీలో మెహ్రౌలీ ఆర్కియాలజికల్ పార్క్(పురావస్తు పరిశోధన సంస్థ) ప్రాంతంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాలను కూడా విడవడంలేదు. ఈ నెల 10వ తేదీనుంచే మెహ్రౌలీ ప్రాంతంలోని లధ్దాక్ సరై గ్రామంలో పేదల ఇళ్లన్నింటినీ కూలగొట్టి వారిని నిర్వాసితులను చేశారు. ఢిల్లీ అభివృద్ధి సంస్థ(డీడీఏ) గత డిసెంబరులోనే ఇళ్లను ఖాళీ చేయవలసిందిగా తాము నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు. ఈ పురావస్తు పరిశోధనసంస్థ సమీపంలో అనేక అపురూపమైన కళా ఖండాలున్నాయి. ఇవి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఢిల్లీ ఆర్కియాలజికల్ విభాగం రక్షణలో ఉన్నాయి. ఆక్రమణలపేరుతో కూలగొడుతున్న పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ప్రత్యామ్నాయ నివాసాలను చూపించకుండానే కూలగొడుతున్నారు. అనేక సంవత్సరాలుగా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు వాయిదా పడుతున్నాయని అధికారులు నమ్మబలుకుతున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ వచ్చినప్పుడు కూడా ఆయన పర్యటించిన ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాన్నే చేపట్టారు.

అధికారుల దౌర్జన్యకాండను నిరసిస్తూ నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల సైతం అధికారులు లెక్కచేయకుండా ఇళ్లను కూలగొట్టే పని కొనసాగిస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు జస్టిస్ మన్‌మీత్ ప్రీతమ్ సింగ్ నాయకత్వంలోని ఏకసభ్య ధర్మాసనం కూలగొట్టడాన్ని నిలిపివేసే యథాస్థితిని కొనసాగించాలని గత శుక్రవారం ఉత్తర్వు చేశారు. ఇళ్లను కూల్చివేయకుండా నివారించాలని గోసియా కాలనీ సేవా సమితి ఢిల్లీ అభివృద్ధి సంస్థను ఆదేశించాలని కోర్టుకు వెళ్లింది. గోసియా మురికివాడ ప్రాంతాల నివాసితులు కలిసి ఈ పిటిషన్ దాఖలు చేశారు. మెహ్రౌలి మురికివాడ ప్రాంతాల్లో 400కుపైగా పేదల కట్టడాలు ఉన్నాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది అనుప్రద సింగ్ కేసును వాదించారు. ఆమె తన వాదనలలో ఢిల్లీ పట్టణ నిర్మాణ అభివృద్ధి బోర్డు ప్రచురించిన జాబితాలో ఈ కాలనీ వరుసనెంబర్లు 18లో ఉన్నవని, ఈ అంశాన్ని 2018లో బోర్డు వెబ్‌సైట్‌లో కూడా ఉంచారని తెలిపారు. మురికివాడల్లో నివసిస్తున్నవారికి ఇళ్లు ఖాళీచేయాలని నోటీసులు ఇవ్వలేదని, ఈ ప్రాంతంలో ఇళ్లను చట్టవిరుద్ధంగా కూలగొట్టారని ఆమె తన వాదనలో వినిపించారు.

మెహ్రౌలిలో ఉన్న పేదల బస్తీని కోడ్ నం.769 కింద కేటాయించి 400 మురికివాడలను రికార్డు చేసిన జాబితాలో పేర్కొన్నట్టు ఆమె చెప్పడించారు. అందువల్ల ఈ కాలనీల్లో ఇళ్లను కూల్చివేయడం చట్టవిరుద్ధమని ఆమె కోర్టుకు విన్నవించారు. అవసరమైతే ఇళ్లను ఖాళీచేయించడానికి ముందే అక్కడ నివసిస్తున్నవారికి ఆ ప్రాంత భూమిపై అధికారం కల్పిన డీడీఏ హామీ ఇచ్చిందని కూడా న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు ఉండటం ప్రాథమిక హక్కు అని, ఢిల్లీ పట్టణ నివాసాల అభివృద్ధిబోర్డు స్పష్టంగా తెలిపిందని, ఆ విధంగా కూడా ఇక్కడి ఇళ్లను కూలగొట్టడం దుర్మార్గమని ఆమె పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు సైతం లెక్కించకుండా అనేక దుర్మార్గాలకు పాల్పడుతున్న అధికార వర్గాలు ఢిల్లీ ప్రభుత్వ సూచనలను సైతం పట్టించుకోవని గతంలోనే రుజువైంది. ఈ కేసుపై మంగళవారం కోర్టు విచారణ జరిపింది. అయితే ఇంకా కోర్టు తన అభిప్రాయాన్ని ప్రకటించవలసివుంది.

రైతులపై కక్షసాధింపు బడ్జెట్

రావుల వెంకయ్య

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న 2023-24 సంవత్సరాలకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆడంబరంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇది భారతదేశ ప్రజలకు "అమృతకాల" బడ్జెట్ అన్నారు. నప్తరుషుల పేరిట ఏడు అంశాలపై 45 లక్షల కోట్లతో ఈ బడ్జెట్ ఉంది. అందులో మొదటి స్థానంలో 5లక్షల 8వేల కోట్లతో రక్షణరంగం ఉంటే, 7వ స్థానంలో (చివరి స్థానంగా) వ్యవసాయరంగం ఒక లక్ష నలభై ఐదు వేల కోట్లతో 3.2%గా ఉంది. గత సంవత్సరం 3.84%తో ఒక లక్షా యాభై ఒక్క వేల కోట్లు కేటాయింపులు ఉండేవి. దాన్నెందుకు వ్యవసాయరంగానికి కేటాయింపులు పెరిగినట్లా? తరిగినట్లా? అక్షరాల నూటికి నూరు శాతం తగ్గినట్లే. యావత్ ప్రజలకు ఈ బడ్జెట్ అమృతకాలం కాదు. గరళ (విషం) కాలంగా భావించాలి. ఇది కార్పొరేట్లకు, అదానీ, అంబానీలకు అమృత కాలంగా భావించాల్సి ఉన్నది.

ఎరువుల సబ్సిడీకి రెండు లక్షల ఇరవై ఐదు వేల కోట్ల నుండి లక్షా డెబ్బై ఐదు వేల కోట్లకు తగ్గించారు. సేంద్రీయ ఎరువుల రైతులే తయారు చేసుకోవాలని సెలవిచ్చారు. గోబర్ గ్యాస్ లాంటి పురాతన ఎరువులకు రైతులను వెళ్ళమంటున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 68 వేల కోట్ల నుండి 60 వేల కోట్లకు తగ్గించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకానికి గతంలో 10,435 కోట్లుగా ఉంటే నేడు 7,150 కోట్లకు కుదించారు. కిసాన్ ఉన్నతి యోజన 7,183 కోట్ల నుండి 7,066 కోట్లకు తగ్గించారు. నీటి పారుదల రంగానికి దేశవ్యాప్తంగా కేవలం 7 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. ధరల స్థిరీకరణ నిధికి మొదట 3 వేల కోట్లుగా ప్రకటించి ప్రతి సంవత్సరం తగ్గిస్తూ గత సంవత్సరం 1,500 కోట్లుగా ఉంటే నేడు కోటి రూపాయలకు నామమాత్రం చేశారు. మద్దతు ధరల కోసం ప్రధాన మంత్రి ఆశా పథకాన్ని దాదాపు రద్దు చేసినట్లే. ఆహార సబ్సిడీకి 2.8 లక్షల కోట్ల నుండి 1.97 లక్షల కోట్లకు కుదించారు. మార్కెట్ యార్డులకు పంగనామాలు పెట్టినట్లే. రాబోయే కాలంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యఫ్.సి.ఐ) కనుమరుగయ్యే ప్రమాదం కలిగినట్లే. పేద ప్రజలకిచ్చే రేషన్ బియ్యం రద్దు చేయాలనే ఆలోచన కనబడుతున్నది.

రాబోయే కాలం ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట వేస్తామన్నారు. ఈ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటిస్తామన్నారు. కానీ వాటికి కేటాయించినది కేవలం 10 వేల కోట్లు మాత్రమే. చిరుధాన్యాలకు గిట్టుబాటు ధర మాటమాత్రంగా కూడా చెప్పలేదు. ఇప్పటికే చిరుధాన్యాల ఉత్పత్తిలో మనమే ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్నాము. వ్యవసాయంలో సాంకేతిక విప్లవం తెస్తామని, డిజిటలైజేషన్ ఇన్ అగ్రికల్చర్ మీద యం.ఓ.యు. ప్రవేశపెట్టారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించాల్సిందే. కానీ అది ప్రభుత్వరంగంలో కాకుండా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి ఒప్పందం చేసుకున్నారు. వారిలో అమెజాన్, వాల్‌మార్ట్, ఐటిసి, మాన్‌శాంటో, బైయర్, పతంజలి లాంటి కంపెనీలున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సహకార వ్యవస్థను బలోపేతం చేసి వాటి ద్వారా ఇది అమలు జరిపితే బాగుంటుంది. రైతుల రుణాలు 20 లక్షల కోట్లు పెంచినట్లు గొప్పలు చెప్పారు. వ్యవసాయంతోపాటు పశు పోషణ, పండ్ల తోటలు, మత్స్యశాఖ, కోళ్ళ పరిశ్రమ లాంటివి కూడా కలిపి దీనిలో ఉన్నాయి. ఒక్క వ్యవసాయానికే 50 లక్షల కోట్లకు పైగా కావాలి. ఇప్పుడు బ్యాంకులు రైతులకివ్వాల్సిన పెట్టుబడిలో 50 శాతం కూడా రావటంలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీ 2% నుండి 1.5%కి తగ్గించారు. అంటే రైతులపై పెనుభారం మోపినట్లే.

ఈ కేటాయింపులు చూసిన తరువాత ఏమి అర్థమవుతుంది? సంవత్సర కాలంగా కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా నల్ల చట్టాల మీద రైతులు చారిత్రాత్మక దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించారు. 750 మందికి పైగా రైతుబిడ్డలు అమరులయ్యారు. 4 వేలకు పైగా కేసులు నేటికీ నడుస్తున్నాయి. చివరికి నరేంద్ర మోదీ దిగివచ్చి పార్లమెంటు సాక్షిగా నల్ల చట్టాలను ఉపసంహరించుకుని కన్నీళ్లు పెట్టుకుని యావత్ రైతు జాతికి క్షమాపణలు చెప్పారు. రైతు ఉద్యమకారులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చి ఇప్పటికి సంవత్సరం దాటింది. ఈ బడ్జెట్‌లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వారు సెలవిచ్చిన రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తారని, దానికి అనుగుణంగా బడ్జెట్‌లో తగిన కేటాయింపులు పెంచుతారని రైతులోకం అంతా వెయ్యి కళ్లతో ఎదురుచూసారు. కానీ రైతులకు తీవ్ర ఆశాభంగం ఎదురైంది. ఈ బడ్జెట్ ప్రతిపాదనలలో రైతు మద్దతు ధరల విషయం కానీ, రైతు రుణ విమోచన కానీ మాటమాత్రంగా కూడా చెప్పలేదు. 'రైతు ఉద్యమ ఫలితంగా నా చేత కన్నీరు పెట్టించుకుని క్షమాపణలు చెప్పే పరిస్థితి తీసుకువచ్చారని' యావత్ రైతు జాతిపై కక్ష సాధింపు పద్ధతుల్లో ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు కనబడుతున్నది. రైతులు నిరాశ పడకుండా తిరిగి ఐక్యశక్తిని కూడదీసుకుని అందరినీ కలుపుకుని మరో ఉద్యమానికి అంకురార్పణ చెయ్యాల్సి ఉంది. అందుకు పార్లమెంటులో ఈ బడ్జెట్ మూసేలోపు వ్యవసాయరంగానికి అనుకూలంగా సవరణలు చేయాలని కోరుతూ మార్చి 20వ తేదీ "ఛలో పార్లమెంట్ "కు రైతుసంఘాల సమన్వయ సమితి పిలుపునిచ్చింది. దాన్ని జయప్రదం చేయడం ద్వారా మోదీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. దానికి రైతులంతా సమాయత్తం కావాలి.

వ్యాస రచయిత ఎఐకెఎస్ అధ్యక్షుడు

ప్రభుత్వ భవనంలో శివలింగమా!

వి.మోయ్

ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లో శివలింగం ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధం. మనది లౌకిక రాజ్యం. అనగా ప్రభుత్వం మతపరమైన వాటిని ప్రోత్సహించరాదు. భిన్నమతాలు, సంస్కృతులు, ఆచారాలు కలిగిన దేశం మనది. దేవుడు, మతమూ వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి. ప్రభుత్వపరంగా, అధికారికంగా, మతపరంగా జరిగే కార్యక్రమాలకు ప్రజాధనాన్ని ప్రభుత్వం ఉపయోగించరాదు. అది రాజ్యాంగ వ్యతిరేకం. ప్రజాపాలనకోసం ఉపయోగించవల్సిన ఒంగోలు కలెక్టరేట్ పరిధిలోని ప్రభుత్వ భవనంలో మతపరమైన విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారు? కలెక్టరు కార్యాలయంలో జరిగే ప్రతి విషయమూ కలెక్టరుకు తెలియకుండా జరగదు. మరి శివలింగ నిర్మాణం ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఎలా జరిగిందో తెలియచెయ్యాల్సిన బాధ్యత కలెక్టరుకి ఉంది. నిర్మాణంకోసం ఎంత ఖర్చు అయింది, ఎవరు ప్రభుత్వ అనుమతి ఉందా, మరి ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణం జరిగిందా? అలా జరిగొచ్చా? అనేది ప్రజలకున్న సందేహం. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ గోడలకు దేవుని బొమ్మలు, బీరువాలకి మతపరమైన బొమ్మలని పెట్టి, వారం వారం పూజలుకూడా చేస్తుంటారు. అలాగే కొత్త అధికారి వచ్చినపుడల్లా వాస్తు పేరుతో మరమ్మతులు, ఇవన్నీకూడా లౌకికతత్వంలో చెయ్యకూడదు. మన రాజ్యాంగంలో సెక్యులరిజం అని వ్రాసుకున్నాం. పాలనలో ఎక్కడా మతజోక్యం ఉండరాదు. కానీ మన నాయకులకు రాజ్యాంగంపై ఎటువంటి గౌరవం లేకుండా ప్రభుత్వ కార్యాలయాలలో భజనలు, శాంతి పూజలు చెయ్యటమనేది రాజ్యాంగాన్ని తూట్లు పొడిచినట్లే. కనుక వెంటనే శివలింగాన్ని ప్రభుత్వ భవనం నుండి తొలగించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం తంతు ప్రజలకు తెలియచెయ్యాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరక్కుండా, అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

నార్నె వెంకటసుబ్బయ్య

నిరుద్యోగం, పేదరికంలో అగ్రగాములం

దేశ ప్రధాని మోదీ బెంగళూరులో మాట్లాడుతూ రక్షణ, విమాన రంగాల్లో దేశం స్వావలంబనదిశగా ఉందని అన్నారు. దిగుమతుల స్థాయి నుండి ఎగుమతుల స్థాయికి చేరుకున్నామని సెలవిచ్చారు. వాస్తవానికి దేశం అగ్రగామిగా ఉన్నది నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత, దారిద్ర్యం, జీవన ప్రమాణాల దిగజారుడు, అనారోగ్యం, అవిద్య, దివాళాకోరుతనం, అజ్ఞానం, కాలుష్యం, అభద్రతాభావం, ఆహార కల్తీ, విదేశీ వస్తువుల వినియోగదారులలో, మేధో వలసలు ఎక్కువగా ఉన్న సంగతి ప్రపంచానికి మనం చెప్పక్కర్లేదు. అధిక ద్రవ్యోల్బణం, గరిష్ఠ స్థాయికి నిరుద్యోగం, ప్రజాస్వామ్యం అణచివేత విద్వేష రాజకీయాలు, రూపాయి విలువ భారీగా పతనం, కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ, సమాజంలో విభజన, దేశ భద్రతలో వైఫల్యం, ప్రజాస్వామ్యం, సెక్యూలరిజం, సహనం లేకుండా పోవడం ఈ నవ వసంతాలలో ఎక్కువగానున్న సంగతి ప్రజలు తెలుసుకుంటున్నారు. ప్రతి అడ్డమైన పనికి దేశభక్తి, దేశ సంస్కృతి ముడిపెట్టి ప్రచార ఆర్భాటాలకు పరిమితమైన ప్రభుత్వాన్ని చూస్తున్నాం. ఈ సంవత్సరాన్ని తృణధాన్యాల సంవత్సరంగా నామకరణం చేశారు. తృణధాన్యాలను పండించే రైతుకు ప్రోత్సాహకం లేకుండా చేసి వినియోగ పంటలనుండి వాణిజ్య పంటలకు మారే దుస్థితి వచ్చింది. దేశ రాజధానిలో గాలి నాణ్యత సూచీ 500 దాటింది. ప్రపంచంలో నివాసయోగ్యంకాని నగరాలు ఏవైనా ఉన్నదా అంటే దీనికి సమాధానం ఢిల్లీ అని చెప్పవచ్చు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి. ఢిల్లీ, యూపీ, హర్యానా పంజాబ్ రాష్ట్రాలలో పంటలను తగలబెట్టడం వలన, పరిశ్రమల నుండి వెలువడుతున్న విషవాయువులు, వాహనాలు వెలువరించే కాలుష్యం వల్ల వివరీతమైన ఈ దుస్థితి ఏర్పడింది. ఈ పాపం నాది కాదు అంటే నాదికాదని రాష్ట్రాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. దేశ సాగు భూముల్లో సేంద్రియ కర్బనం తగ్గిపోతున్నది. మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడటంతో భూమలు నిస్సారం అవుతున్నాయి. భూసారం గురించి మంచి వ్యవసాయ పద్ధతులు పాటించే వారు కరువయ్యారు. కలుపు నివారణకు నిషేధించిన చేసిన గ్లైసిల్, పెండి మీథేన్, స్టాంప్ లాంటి భయంకర రసాయనాలు వాడుతున్నారు. 'మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి పునాది' వాటిలో ప్రొటీన్స్, కార్బోహైడ్రేట్స్, విటమిన్స్, మినరల్స్ వంటి పోషకాలన్నీ ఉండాలి. మనిషి మానసికంగా శారీరకంగా ఎదిగేందుకు ఎంతో ఉపకరిస్తాయి. ఈ రకమైన సమతుల ఆహారాన్ని తీసుకోలేక పిల్లలు పోషకాహార లోపానికి గురవుతున్నారు. పోషకాహార లోపం కేవలం ఆరోగ్యపరమైన సమస్య మాత్రమే కాదు వ్యక్తి, కుటుంబం, సమాజంపైనా ఇది విస్తృత దుష్ప్రభావాన్ని చూపుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఈ లోపాలు అధికోత్పత్తిని దెబ్బతీసి పేదరికాన్ని పెంచుతుంది. ప్రతిరోజు సుమతుల ఆహారం అందితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉన్నట్లు. పోషకాహారం లోపిస్తే ప్రజల జీవన ప్రమాణాలు క్షీణిస్తాయి. పౌష్టికాహార లోపాన్ని

జయించడానికి దేశంలో ప్రజలు భజనలు చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సగానికి పైగా చిన్నారులు పిల్లల్లు రాలిపోతున్నారు. పిల్లలకు మూడు పూటలు తిండి లేక దీనస్థితిలో కడు పేదరికంలో బతికీడుస్తున్న కుటుంబాలు కోకొల్లలు. కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నామని గొప్పగా ప్రచారం చేస్తున్నది. కానీ చిన్నారుల పొట్ట కడుపుల్లోకి చిదిమిపోతున్నారని నిజం చాలా మందికి తెలియదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో పోషకాహారలోపం సమస్య ఉంది కానీ ఈ సమస్య తీవ్రత మన దేశంలో అధికంగా ఉంది. ఉండవలసిన బరువుకంటే తక్కువ బరువువున్న పిల్లలు 40శాతం మన దేశంలోనే ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ప్రతి ఏటా మన దేశంలో సగంవరకు శిశు మరణాలు పౌష్టికాహార లోపంవల్లే సంభవిస్తున్నాయి. ప్రధానంగా మహిళల్లో పౌష్టికాహారలోపం సమస్యతో 56శాతంమంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు సర్వేలు తెలియజేశాయి. దీనికి కారణం పేదరికం, నిరక్షరాస్యత, ఎక్కువగా పిల్లలు వున్న కుటుంబాల్లో పౌష్టికాహారం లోపం మరింతగా ఉంది. శీతలపానీయాల్లో ఎక్కువశాతం పురుగుమందుల అవశేషాలు వున్నట్లుగా ఉన్నట్లు సెంటర్‌ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇండియా దశాబ్ది క్రితమే తేల్చి చెప్పింది. వీటిల్లో ఉండే కార్బొనేటెడ్ వాటర్, కార్న్ సిరప్, పంచదార, ఎస్పర్టం, కారమెల్,ఫాస్ఫారిక్ ఆమ్లం, కెఫిన్, సిట్రిక్ ఆమ్లం, పొటాషియం బెంజైట్, పొటాషియం సిట్రేట్ ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ పానీయాల్లో ఉండే ఆర్గానో క్లోరిన్, ఆర్గానో ఫాస్ఫరస్ పురుగుల మందులైన లిండేన్,డిడిటి, మలథియాన్ ఉన్నట్లు పరిశోధకులు చెపుతున్నా ప్రభుత్వాలు వీటిని నిషేధించలేదు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి విదేశీ కూల్‌డ్రింక్స్ కంపెనీలు ఏటా లక్షల కోట్లు దోచుకుంటున్నాయి. అలాగే ప్రతి సంవత్సరం విదేశీ మద్యాన్ని దిగుమతి చేసుకోవడం, కొరియా, చైనా, తైవాన్, మలేసియా, సింగపూర్ దేశాల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతి వదిహేనుశాతం అధికంగా ఉంటున్నది. మన దేశంలో ఒక్క మొబైల్ యూనిట్ తయారీ లేదు. ప్రపంచ ఆకలి సూచికలో 129 స్థానం, ఆర్థిక సూచికలో108 స్థానం, మానవ అభివృద్ధి సూచిక, సంతోష సూచిక, ఆరోగ్య సూచికల్లో ఎప్పుడూ వంద స్థానానికి తక్కువ లేకుండా చేసుకుంటున్నాం. అయితే రూపాయి విలువ దిగజారిపోయింది, డాలర్ విలువ పటిష్ఠమైందని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, ఆర్థిక బుడగలు పేలిపోవడం, ద్రవ్య(కరెన్సీ) సంక్షోభం, ప్రభుత్వం తాము చేసిన అప్పులు చెల్లించకపోవడం ఆర్థిక సంక్షోభం కిందికి వస్తాయి.

ఆర్థికవేత్తలు ఆర్థిక సంక్షోభాలు ఎందుకు ఏర్పడతాయి, వాటిని ఎలా నివారించాలనేదానిపై అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు. కానీ వాటి శాస్త్రీయత మీద ఆర్థికవేత్తలకు ఏకాభిప్రాయం లేదు. ఆర్థిక నిర్వహణలో శ్రీలంక ప్రభుత్వం చేసిన తప్పిదాలతో ఆ దేశాన్ని ఇవాళ అత్యంత దీన స్థితిలో నెట్టాయి. పాఠం నేర్చుకోకపోతే ఏ దేశమైనా శ్రీలంకలాగా మునగక తప్పదు. మన దేశంలో ఆర్థికవృద్ధి అంచనాలు గత రెండు సంవత్సరాలలో పేలవంగా ఉన్నాయి. ఉద్యోగాల సృష్టి ప్రభుత్వానికి ఎదురయ్యే అతి పెద్ద అవరోధం. జనాభా రీత్యా ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశంగా భారతదేశం తన యువ కార్మికశక్తిని ఇముడ్చుకోవాలంటే ఏటా 1.20 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. అయితే 2016 నవంబరులో చేపట్టిన పెద్ద నోట్ల రద్దు దెబ్బకు, జీఎస్టీ అమలుతో చిన్న వ్యాపారాలు కుదేలయ్యాయి. చాలా వ్యాపారాలు మూతపడ్డాయి. ఫలితంగా లక్షలాది మంది, ప్రత్యేకించి అసంఘటిత రంగంలో వారు ఉద్యోగాలు కోల్పోయారు. దేశంలో వ్యవసాయం, నిర్మాణరంగం, చిన్న పరిశ్రమలు అతిపెద్ద ఉద్యోగ రంగాలు. ఎందుకంటే కార్మిక శక్తి ఎక్కువ అవసరమైన రంగాలవి. కానీ ఈ మూడు రంగాలూ ఇటీవలి సంవత్సరాల్లో ఉద్యోగాల సృష్టించలేక పోతున్నాయి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వృత్తిదారుల బతుకులు ఉన్నతస్థితికి చేరాల్సిపోయి, నీచ స్థితి చేరడం మొదలయింది. దేశంలో రోజు రోజుకు ఆహార కల్తీ ఎక్కువ అయిపోయింది. ఏది కొనాలి అన్న, తినాలి అన్న భయపడే రోజులు వచ్చాయి. వారి వ్యాపారం పెంచుకోవాలి అని ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు, దీంతో వారి వ్యాపారమే కాదు ఆస్పత్రులు కూడా నిండిపోతున్నాయి. వైద్యులకు కూడా ఈ ఆహార కల్తీ భాగం కలిసి వస్తుంది అని చెప్పారు. టీ, కాఫీ, పాలు,తేనె, పిండి, నూనెలు, మాంసం, కంది పప్పు, మిరియాలు, జీలకర్ర, బియ్యం ఇలా నిత్యం వినియోగించుకునే అన్ని పదార్థాలు కాదేది కల్తీకి అనర్హం అన్నట్లుంది పరిస్థితి.

డాక్టర్ యం.సురేష్‌బాబు, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

నిజం గొంతు నొక్కడమే

- బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులను ఖండించిన వామపక్షాలు
- భయపడుతున్న ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమిది : సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం

న్యూఢిల్లీ : ఢిల్లీ, ముంబైలోని బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) కార్యాలయాలపై ఆదాయపు పన్ను విభాగం (ఐటీ) దాడులు చేయడాన్ని వామపక్ష పార్టీలు మంగళవారం తీవ్రంగా ఖండించాయి. 2002 గుజరాత్ అల్లర్లపై ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసిన తర్వాత వార్తా ప్రసార సంస్థను బెదిరించే ప్రయత్నమే ఈ చర్య అని విమర్శించాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని నిరసించాయి. ప్రభుత్వం 'తన మత-ఫాసిస్ట్ విధానాలను విమర్శించే, బహిర్గతం చేసే ప్రతి ఒక్కరిపై దాడి చేయడంతో అపఖ్యాతి పాలైంది' అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విమర్శించింది. 'బీబీసీ ఇటీవల 'ది మోడీ క్వశ్చన్' అనే డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సంగతిని ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. ఇది మోదీ ప్రభుత్వానికి కోపం తెప్పించింది. ఇది విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రదేశాలలో ప్రసారాన్ని అనుమతించలేదు' అని ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఇప్పుడు మోదీ ప్రభుత్వం విదేశీ ప్రసార సంస్థను భయపెట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుంది. ఇలాంటి చర్య మీడియా స్వేచ్ఛకు సంబంధించినంతవరకు ఇప్పటికే దెబ్బతిన్న దేశం ప్రతిష్ఠను తగ్గించే అవకాశం ఉంది' అని పార్టీ పేర్కొంది. సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం మాట్లాడుతూ సత్యం గొంతు నొక్కేందుకు 'భయపడ్డ ప్రభుత్వం' చేస్తున్న ప్రయత్నమే 'ఐటీ సర్వే' అని అన్నారు. ఈ చర్య 'దాడి' అని, 'సర్వే' కాదని కూడా విమర్శించారు. 'బీబీసీపై దాడి! వారు దాన్ని సర్వే అంటారు! ఈ సర్వే భయపడిన ప్రభుత్వ హత్యాకాండ. నిజం గొంతు నొక్కడానికి. దానికి ప్రపంచం సాక్షిగా ఉంది. మోదీ జీ-20కి అధ్యక్షత వహించినప్పుడు, వారు పత్రికా స్వేచ్ఛపై భారతదేశ రికార్డు గురించి అడుగుతారు. అతను సత్యానికి పూర్తిగా సమాధానం చెప్పగలడా?' అని విశ్వం ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు, 'ఆదాయ పన్ను శాఖ, ఇతర ఏజెన్సీలు జరిపిన దాడుల ద్వారా భారతీయ మీడియాను భయపెట్టడం నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రామాణిక వ్యూహం. ఇది ఇప్పుడు భారతదేశంలో పని చేస్తున్న విదేశీ మీడియా సంస్థకు కూడా విస్తరించబడింది' అని సీపీఎం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఈ బలవంతపు చర్య, మీడియా విమర్శలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వం నిరంకుశ పాలన అనే ప్రతిష్ఠను అంతర్జాతీయంగా మరింత బలపరుస్తుంది' అని పేర్కొంది. అదానీ గ్రూప్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ జరపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించడం లేదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. 'మొదట బీబీసీ డాక్యుమెంటరీలను నిషేధించడం. అదానీ బహిర్గతంపై విచారణ లేదు. ఇప్పుడు బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులు! భారతదేశం : 'ప్రజాస్వామ్య తల్లి'? అని ఏచూరి ట్వీట్‌లో పేర్కొన్నారు. పన్ను ఎగవేత ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా ఆదాయపు పన్ను శాఖ మంగళవారం ఢిల్లీ, ముంబైలోని బీబీసీ కార్యాలయాల్లో సర్వే నిర్వహించిందని అధికారులు తెలిపారు. బ్రాడ్‌కాస్టర్ 'ఇండియా : ది మోడీ క్వశ్చన్' అనే రెండు భాగాల డాక్యుమెంటరీని ప్రసారం చేసిన వారాల తర్వాత ఆశ్చర్యకరంగా ఈ ఈ దాడులు జరిగాయి. ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్ జనరల్ మూడు ప్రాంగణాల్లో ప్రారంభించినట్లు తెలిసింది.

'బెదిరింపు వ్యూహాలను' ఖండిస్తున్నాం : కాంగ్రెస్

బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ సర్వే ఆపరేషన్‌ను 'బెదిరింపు వ్యూహాలు'గా అభివర్ణించిన కాంగ్రెస్ పార్టీ... మోదీ ప్రభుత్వం విమర్శలకు భయపడుతున్నట్లు ఈ చర్య తెలియజేస్తోందని విమర్శించింది. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుండగా, 'బీబీసీ తర్వాతే ప్రభుత్వం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'వినాశ్ కాలే, విప్రీత్ బుద్ధి' (వినాశనం సమీపించినప్పుడు, ఒక వ్యక్తి మేధస్సు అతని ఆసక్తికి వ్యతిరేకంగా పని చేస్తుంది) అంటూ ప్రభుత్వంపై దాడికి హిందీ యాసను కూడా ఆయన ఉపయోగించారు. ఈ పరిణామంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థ) కె.సి.వేణుగోపాల్ స్పందిస్తూ, బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులు 'నిరాశతో నిండిపోయిన మోదీ ప్రభుత్వం విమర్శలకు భయపడుతున్నట్లు చూపిస్తుంది' అని అన్నారు. 'ఈ బెదిరింపు వ్యూహాలను మేము తీవ్ర పదజాలంతో ఖండిస్తున్నాము. ఈ అప్రజాస్వామిక, నియంతృత్వ వైఖరి ఇకపై కొనసాగదు' అని ఆయన ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రధాని నియంతృత్వపు ఎత్తులకు చేరుకున్నారు : ఆప్

ఢిల్లీ, ముంబైలలోని బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను సర్వే ఆపరేషన్ పేరుతో దాడులు చేయడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కేంద్రంపై మండిపడింది. ప్రధాని నరేంద్ర మోదీ నియంతృత్వపు శిఖరాలకు చేరుకున్నారని తెలిపింది. 'మోదీ జీ, మీరు నియంతృత్వపు శిఖరాలకు చేరుకున్నారు' అని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అయిన ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ హిందీలో ట్వీట్ చేస్తూ సర్వేపై తీవ్రంగా స్పందించారు. 'మొదట, బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం విధించారు. ఇప్పుడు వారి కార్యాలయాలపై దాడులు... మోదీ జీ, హిట్లర్ నియంతృత్వం కూడా అంతం అయిందని మర్చిపోకండి... మీ నియంతృత్వం కూడా అంతం అవుతుంది' అని ఆప్ నేత అన్నారు.

ప్రజాస్వామ్యానికి ఏ నిర్వచనం చెప్పాలి

బీబీసీ కార్యాలయాలపై దాడిని ఖండించిన ఉద్ధవ్ థాకరే



ముంబై : బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ 'సర్వే' ఆపరేషన్‌ను శివసేన నాయకుడు ఉద్ధవ్ థాకరే మంగళవారం ఖండించారు. ఇది ప్రజాస్వామ్యంలో ఎలా ప్రవర్తించిందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న బీజేపీ పేరు ప్రస్తావించకుండా, శివసేనలోని ఒక వర్గానికి నాయకత్వం వహిస్తున్న థాకరే... దేశంలో క్రూరమైన ధోరణి దాని తల ఎత్తడానికి ప్రయత్నిస్తోందని, 'మేము కలిసి రాకపోతే అది దేశం మొత్తాన్ని మింగేస్తుందని అన్నారు. 'మీడియా కార్యాలయంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి ఏ నిర్వచనంలో సరిపోతుంది? దీని అర్థం మీరు (ప్రభుత్వం) మీకు ఏది కావాలంటే అది చేయగలరు. కానీ మేము మా గొంతు ఎత్తకూడదు. గళం విప్పితే ప్రభుత్వం చితక్కొడుతుంది' అని ఉద్ధవ్ తెలిపారు.

బీబీసీ తర్వాత 'మిస్టర్ ఏ'పై ఉంటుందా?

టీఎంపీ ఎంపీ మొహిత్రా

న్యూఢిల్లీ : బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) కార్యాలయాలపై 'దాడులు' తర్వాత అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై 'మిస్టర్ ఏ' దాడి చేస్తారా అని ఎంపీ మహువా మొయిత్రా మంగళవారం ప్రశ్నించారు. 'ఏజెన్సీలు ఈ వాలెంటైన్ డే 'సర్వేలు' చేస్తున్నందున, ప్రభుత్వం అత్యంత విలువైన ప్రియురాలు 'మిస్టర్ ఏ' గురించి ఎలా నిర్వహిస్తుంది?' అని ఆమె సెబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ట్యాగ్ చేస్తూ ఒక ట్వీట్‌లో పేర్కొంది. 'బీబీసీ ఢిల్లీ కార్యాలయంలో ఆదాయపు పన్ను శాఖ దాడులు చేసినట్లు నివేదికలు. వావ్, నిజంగా? ఎంత ఊహించనిది. ఇంతలో అదానీ సెబీ భారత చైర్మన్‌తో ఆఫీసుతో చాట్ చేయడానికి వచ్చినప్పుడు అతనికి ఫర్సాన్ సేవ' అని మొయిత్రా మరొక ట్వీట్‌లో తెలిపారు. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఒక నివేదికలో... అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో ఆర్థిక అవకతవకలు, స్టాక్‌లో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించింది. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణకు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ అదానీ గ్రూప్ ఆరోపణలను నిరాధారమైనవని కొట్టిపారేసింది.

భారత్‌పై బీబీసీ 'విషపూరిత' నివేదికలు

బీజేపీ ఆరోపణ

న్యూఢిల్లీ : బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) భారతదేశానికి వ్యతిరేకంగా 'విషపూరితమైన' నివేదికను విడుదల చేసిందని, దాని ప్రచారం, కాంగ్రెస్ అజెండా కలిసి ఉన్నాయని బీజేపీ మంగళవారం ఆరోపించింది. ముంబై, ఢిల్లీలోని బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సర్వే చేసిన వెంటనే ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. విలేఖరుల సమావేశంలో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ ఆదాయపు పన్ను విభాగం (ఐటీ) చర్యపై కాంగ్రెస్ విమర్శలను తోసిపుచ్చారు. ప్రభుత్వ సంస్థ తన పనిని చేయడానికి అనుమతించాలని అన్నారు. 'చర్య సమయాన్ని ప్రభుత్వం లేదా బయట శక్తి ఎవరూ నిర్ణయించలేరు' అని తెలిపారు. లండన్‌లో ప్రధాన కార్యాలయం బీబీసీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బీబీసీ ప్రపంచంలోనే అత్యంత అవినీతికరమైన సంస్థ అని, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కూడా ఈ వార్తా సంస్థను నిషేధించారని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలని అన్నారు. బీబీసీకి 'భారతదేశంపై దురుద్దేశంతో పనిచేసిన కళంకిత, నల్ల చరిత్ర' ఉందని బీజేపీ నాయకుడు తెలిపారు. సంస్థ భారతదేశంలో పనిచేస్తుందే కానీ రాజ్యాంగం పట్ల పెద్దగా గౌరవం లేదని భాటియా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ముందుకు సాగుతున్న తరుణంలో దానిని ఇష్టపడని అనేక శక్తులు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్, దాని నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా 'బాధ' అనుభవిస్తున్నాయని అన్నారు. మోదీ హయాంలో దేశం పురోగమిస్తోందని ఆయన చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ధోరణి

బీబీసీపై ఐటీ దాడులకు ఎడిటర్స్ గిల్డ్ ఖండన

న్యూఢిల్లీ : బీబీసీ ఇండియా కార్యాలయాలలో ఆదాయపు పన్ను సర్వేపై భారత ఎడిటర్స్ గిల్డ్ మంగళవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాలక ప్రభుత్వాన్ని విమర్శించే మీడియా సంస్థలను 'భయపెట్టడానికి, వేధించడానికి' ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగించుకునే 'ధోరణి' కొనసాగింపుగా పేర్కొంది. జర్నలిస్టులు, మీడియా సంస్థల హక్కులను అణగదొక్కకుండా అటువంటి పరిశోధనలన్నింటిలో చాలా శ్రద్ధ, సున్నితత్వం చూపాలని గిల్డ్ ఒక ప్రకటనలో కోరింది. 'ప్రభుత్వ విధానాల లేదా పాలక వ్యవస్థను విమర్శించే పత్రికా సంస్థలను భయపెట్టడానికి, వేధించడానికి ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగించుకునే ధోరణిలో ఐటీ విభాగం సర్వే కొనసాగుతోంది' అని గిల్డ్ ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపింది. గుజరాత్‌లో 2002లో జరిగిన హింసాకాండ, భారతదేశంలోని మైనారిటీల ప్రస్తుత స్థితిగతులపై బీబీసీ రెండు డాక్యుమెంటరీలను విడుదల చేసిన వెంటనే ఐటీ సర్వే వచ్చిందని గిల్డ్ పేర్కొంది. ఈ డాక్యుమెంటరీలు రాజకీయంగా ప్రకంపనలు సృష్టించాయి. అయితే గుజరాత్ హింసపై బీబీసీది తప్పుడు, పక్షపాతంతో కూడిన నివేదిక అని ప్రభుత్వం ఆరోపించింది. అలాగే భారతదేశంలో ఆన్‌లైన్‌లో, చిత్రాలను చూడడాన్ని నిషేధించే ప్రయత్నం చేసిందని పేర్కొంది. న్యూస్‌క్లిక్, న్యూస్‌లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్ కార్యాలయాల్లో 2021లో ఐటీ సర్వేలు జరిగాయని గుర్తుచేసింది. 'ప్రతి సందర్భంలోనూ దాడులు, సర్వేలు వార్తా సంస్థల ద్వారా ప్రభుత్వ స్థాపనపై క్లిష్టమైన కవరేజీకి వ్యతిరేకంగా ఉన్నాయి' అని గిల్డ్ తెలిపింది. 'ఇది రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ధోరణి' అని పేర్కొంది. అటువంటి పరిశోధనలు పరిశోధనలు నిర్దేశిత నిబంధనల ప్రకారం నిర్వహించబడుతున్నాయని, స్వతంత్ర మీడియాను బెదిరించే వేధింపుల సాధనంగా అవి దిగజారకుండా ప్రభుత్వాలు నిర్ధారించాలని గిల్డ్ తన మునుపటి డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

అదానీ గ్రూపుపై ఆరోపణలు

కేంద్రంపై వేలు చూపిస్తున్నాయి

తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

చెన్నై : అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలు బీజేపీ ప్రభుత్వంపైనే నేరుగా వేలెత్తి చూపిస్తున్నాయని, అందుకే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణకు కేంద్రం ఆదేశించాలని, ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మంగళవారం అన్నారు. ఈ అంశంపై పార్లమెంటులో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలు సందర్భోచితంగా ఉన్నాయని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన సమాధానంగా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం విస్మయం కలిగిస్తోందని ఆయన తెలిపారు. తన 'ఉంగలిల్ ఒరువన్' (మీలో ఒకరు) సిరీస్‌లో ప్రశ్నలకు సమాధానమిస్తూ, పార్లమెంటులో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యల భాగాలను విస్మరించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని స్టాలిన్ అన్నారు. పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను ప్రజల గుండెల్లోంచి తుడిచివేయలేమని అన్నారు. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు బీజేపీ పాలనపై ప్రత్యక్ష ఆరోపణలు అయినందున ప్రభుత్వం జేపీసీ విచారణకు ఆదేశించాలని, ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని అన్నారు. అదానీ గ్రూపునకు సంబంధించిన వ్యవహారాన్ని సుప్రీంకోర్టు స్వయంగా పరిశీలిస్తోందని సీఎం చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చిందన్న మోదీ వ్యాఖ్యకు 'ఆరోగ్యకరమైన రాజకీయం' అని అర్థం కాదా అని అడిగిన ప్రశ్నకు స్టాలిన్ మాట్లాడుతూ 'ఈడీని ఏ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారు అనే దానిపై ప్రధాని చేసిన ఒప్పుకోలు ప్రకటన ఇది' అని తెలిపారు. మొదటిసారిగా, ఒక ప్రధాన మంత్రి ప్రతిపక్ష పార్టీలపై ప్రతీకారం తీర్చుకుంటున్నట్లు పార్లమెంటులో అంగీకరించారు. ఇది దేశానికి మంచిది కాదు, స్వయంప్రతిపత్తి గల సంస్థలకు మంచిది కాదు, ప్రజాస్వామ్యానికి కూడా మంచిది కాదని స్టాలిన్ అన్నారు.

లెఫ్ట్-కాంగ్రెస్ ఐక్యతపై మోదీ కలవరపాటు: మాణిక్ సర్కార్

శాంతిర్‌బజార్: త్రిపురలో లెఫ్ట్-కాంగ్రెస్ కూటమి ఏర్పాటు కావడంతో ప్రధాని మోదీకి కంటిమీద కునుకు లేకుండా పోయిందని సీపీఎం నేత, మాజీ సీఎం మాణిక్ సర్కార్ విమర్శించారు. త్రిపురలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అనుసరించడం లేదన్నారు. ఫాసిస్టు పాలన అంతమే లక్ష్యంగా లెఫ్ట్-కాంగ్రెస్ చేతులు కలిపాయన్నారు. కేరళలో కుస్తీ పడుతూ ఈశాన్య రాష్ట్రాల్లో దోస్తీ చేస్తున్నాయని మోదీ అనడాన్ని ప్రస్తావిస్తూ కేరళలో సీపీఎం అధికార పక్షం కాగా కాంగ్రెస్ ప్రతిపక్షమని గుర్తుచేశారు. త్రిపురలో ఫాసిస్టు పాలన కొనసాగుతోందని సాంతిర్‌బజార్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మాణిక్ సర్కార్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని గిరిజన-గిరిజనేతర ఓటు బ్యాంకును బీజేపీ కోల్పోయిందని, లెఫ్ట్, కాంగ్రెస్ మధ్య రాజకీయ అవగాహన కుదరడం వల్ల బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయే పరిస్థితి లేకపోవడం కాషాయ వర్గాన్ని కలవరబెడుతోందన్నారు. త్రిపురలో రెండు సార్లు పర్యటించి ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మాట్లాడారుగానీ 2018 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రకటించిన విజన్ డాక్యుమెంట్ అమలు ఊసేలేదన్నారు. ఎన్నికల హామీలను మరిచారని, వాటిని కనీసం ప్రస్తావించరన్నారు. ఐదేళ్లుగా ఓటు 'వేయలేకపోయిన' వాంతా గురువారం జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఆజంఖాన్ తనయుడు అబ్దుల్లాపై అనర్హత వేటు!

లక్నో: ఉత్తరప్రదేశ్ శాసనసభ అనర్హత వేటు వేసిన సమాజ్‌వాదీపార్టీ నాయకుడు ఆజంఖాన్ కుమారుడు అబ్దుల్లా ఆజంఖాన్‌పై కూడా అనర్హత వేటు పడనుందా? అంటే అవుననే అనాల్సి వస్తుంది. ఎందుకంటే 15 ఏళ్ల నాటి కేసులో అబ్దుల్లాకు మొరాదాబాద్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మొరాదాబాద్ కోర్టు తీర్పు కాపీ కోసం ఎదురుచూస్తున్నామని, అది అందిన తర్వాత అబ్దుల్లా ప్రాతినిధ్యం వహిస్తున్న స్వర్ అసెంబ్లీ స్థానంపై నిర్ణయం తీసుకుంటామని యూపీ అసెంబ్లీ అధికారులు మంగళవారం వెల్లడించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించబడిన ప్రజా ప్రతినిధులు ఎవరైనా అటువంటి నేరారోపణ నిరూపణ జరిగిన తేదీ నుంచి అనర్హులుగా ప్రకటించబడతారు. జైలు శిక్ష పూర్తయిన తర్వాత మరో ఆరేళ్ల పాటు అనర్హులుగా ఉంటారు. 2008 నాటి కేసులో సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అబ్దుల్లా ఆజం ఖాన్, అతని తండ్రి ఆజం ఖాన్‌కు సోమవారం మొరాదాబాద్ కోర్టు జైలు శిక్ష విధించింది. డిసెంబరు 31, 2007న రాంపూర్‌లోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) క్యాంపుపై దాడి నేపథ్యంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు వారి కాన్వాయ్‌ను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ జనవరి 29, 2008న రాష్ట్ర రహదారిపై నిందితులు ధర్నాకు దిగినట్లు పోలీసులు ఆరోపించారు. అయితే వారిద్దరికీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

అబ్దుల్లా ఆజం ఖాన్, అతని తండ్రిపై సెక్షన్ 353 (ప్రభుత్వ ఉద్యోగిని తన విధులను నిర్వర్తించకుండా నిరోధించడం),

ఐపీసీలోని ఇతర నిబంధనల కింద కేసు నమోదు చేశారు. కాగా ద్వేషపూరిత ప్రసంగం కేసులో రాంపూర్ సదర్ అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన ఆజంఖాన్‌కు గత ఏడాది అక్టోబరులో కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించడంతో అనర్హత వేటు పడింది. గతేడాది డిసెంబరులో ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఆకాష్ సక్సేనా... ఖాన్ శిష్యుడు అసిమ్ రజాపై విజయం సాధించారు. ఆజంఖాన్ 1980 నుండి తొమ్మిది సార్లు రాంపూర్ సదర్‌లో విజయం సాధించారు.

అత్యాచారం కేసులో అన్నదమ్ములకు 20ఏళ్ల జైలు

సుల్తాన్‌పూర్ (యూపీ): ఎనిమిదేళ్ల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఇద్దరు సోదరులకు ఇక్కడి కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అలాగే దారుణానికి పాల్పడిన తర్వాత తన కుమారులు పారిపోవడానికి సహకరించిన ఇద్దరు దోషుల తండ్రికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ శ్రీవాస్తవ తీర్పు చెప్పారు. ఇద్దరు అన్నదమ్ములకు ఒక్కొక్కరికి రూ.90 వేలు, వారి తండ్రికి రూ.10 వేలు చొప్పున కోర్టు జరిమానా కూడా విధించింది. బాలిక మార్చి 24, 2015 న పరీక్ష కోసం తన ఇంటి నుంచి బయటకు రాగా, జితేంద్ర శుక్లా మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. ఆ తర్వాత బాలికపై జితేంద్ర శుక్లా, అతని సోదరుడు హరి ప్రకాష్ శుక్లా అత్యాచారం చేశారు. ఆ తర్వాత తన కుమారులు పారిపోవడానికి తండ్రి సియారామ్ శుక్లా సహకరించారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిషేక్ త్రిపాఠి వెల్లడించారు.

జస్టిస్ కేఏ స్వామి కన్నుమూత



బెంగళూరు: జస్టిస్ కేఏ స్వామి (88) మంగళవారం ఇక్కడి తన నివాసంలో కన్నుమూశారు. కర్ణాటక హైకోర్టు, మద్రాస్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా స్వామి బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పరిశోధన నిమిత్తం స్వామి భౌతికకాయాన్ని ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి అందజేయనున్నట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. జస్టిస్ స్వామి... కొప్పల్ జిల్లా యల్బుర్గ తాలూకా కుద్రికోటగికి చెందినవారు. స్వామి మృతిపై కర్ణాటక లా కమిషన్‌కు చైర్మన్ జస్టిస్ ఎస్ఆర్ బన్నూర్‌మాత్ సంతాపం వెలిబుచ్చారు. స్వామి న్యాయ నిష్ణాతుడని, మానవతావాదియని కొనియాడారు.

రోజుకు 64.13 లక్షల కేసుల పరిష్కారం

బెంగళూరు: లోక్ అదాలత్‌లో ఒకే రోజు (ఫిబ్రవరి 11) రికార్డు స్థాయిలో 64,13,608 కేసులు పరిష్కారమయ్యాయని కర్ణాటక రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (కేఎస్ఎల్ఎస్ఏ) వెల్లడించింది. ఇందులో 52,11,424 ట్రాఫిక్ చలాన్ పెట్టీ కేసులు ఉన్నట్లు పేర్కొంది. జనవరి 27న, కేఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్... ట్రాఫిక్ చలాన్ జరిమానాలపై కనీసం 50 శాతం రాయితీని అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. జస్టిస్ బీ వీరప్ప చేసిన అభ్యర్థనను అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం... ఫిబ్రవరి 2న 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా, కర్ణాటక వ్యాప్తంగా మొత్తం 52,11,424 ట్రాఫిక్ చలాన్ పెట్టీ కేసులు ప్రీ-లిటిగేషన్ కేసులుగా పరిష్కరించబడ్డాయి. ఫలితంగా రూ.152 కోట్లకు పైగా జరిమానా వసూలైంది.

కాగా ట్రాఫిక్ నేరాల జరిమానాలపై రాయితీని మరో రెండు వారాలు పొడిగించాలని కేఎస్ఎల్ఎస్ఏ తాజాగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ట్రాఫిక్ కేసులతో పాటు, లోక్ అదాలత్‌లో 4,14,202 రెవెన్యూ కేసులు, రూ.157 కోట్లకు సంబంధించి 14,723 బ్యాంక్ పెండింగ్ కేసులు, 670 మ్యాట్రిమోనియల్ కేసులు, 2,724 పార్టిషన్ సూట్లు, 4,050 మోటారు వాహనాల క్లెయిమ్‌ల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు.

ఎన్‌పీపీ కోసం ప్రచారం చేసినందుకు మేఘాలయ మహిళా సంఘం చైర్‌పర్సన్‌కు షోకాజ్ నోటీసు

షిల్లాంగ్ : అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) అభ్యర్థి ర్యాలీలో పాల్గొన్న వీడియోలో కనిపించినందున నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై మేఘాలయ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఫిడాలియా టోయికి ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసింది. జోవై అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి టోయ్‌కి షోకాజ్ నోటీసు జారీ చేశారని, రెండు రోజుల్లోగా ఆమె నుంచి వివరణ ఇవ్వాలని ప్రధాన ఎన్నికల అధికారి ఎఫ్ఆర్ ఖార్కోంగోర్ తెలిపారు.

భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 21 ప్రకారం, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణిస్తారు. మేఘాలయ సర్వీస్ (ప్రవర్తన) నిబంధనలు 2019 అటువంటి ఉద్యోగిని ఏ రాజకీయ పార్టీతో లేదా రాజకీయ సంబంధాన్ని కలిగి ఉన్న సంస్థతో సంబంధం కలిగి ఉండకుండా నిరోధిస్తుంది.

జోవై ఎన్‌పీపీ అభ్యర్థి వైలద్మీకి శైలాతో కలిసి గత వారం నామినేషన్ పత్రాలు దాఖలు చేసే రోజు ర్యాలీకి బయలుదేరిన టోయ్ కనిపించిన వీడియో వెలువడింది. 'మేఘాలయ సర్వీసు (ప్రవర్తన) నిబంధనలు 2019ని ఉల్లంఘించినందుకు మీపై ఎందుకు చర్య తీసుకోకూడదో మీరు కారణం చూపాలి' అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు జారీ చేసిన లేఖలో పేర్కొంది. 'మీరు పాల్గొనడం వల్ల మీరు పేర్కొన్న అభ్యర్థికి అనుకూలంగా ఉన్నారనే అనుమానాలకు ఆస్కారం ఉంది. ఇటువంటి చర్యలు ప్రభుత్వ ఉద్యోగి ఆశించే తటస్థతకు విఘాతం కలిగిస్తాయి' అని సోమవారం పంపిన లేఖలో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ ప్రతినిధి బృందం సీఈఓను కలిసి అభ్యర్థితో పాటు టోయ్‌పై శిక్షార్హమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

ట్యాంకర్ల సమ్మెతో ముంబైలో నిలిచిన నీటిసరఫరా

ముంబై: ఆర్థిక రాజధాని ముంబైకు నీటి కష్టాలు ఎదురయ్యాయి. భూజలాల యంత్రాంగం నిబంధనలకు వ్యతిరేకంగా వాటర్ ట్యాంకర్ల యజమానులు సమ్మెబాట పట్టారు. ఈనెల 8 నుంచి నీటి ట్యాంకర్ల ఆందోళన చేస్తుండటంతో ప్రధాన ప్రాజెక్టులు, హోటళ్లు, మాల్స్, క్లబ్బులకు నీరు సరఫరా కాలేదు. ముంబై వాటర్ ట్యాంకర్ల సమాఖ్య (ఎండబ్ల్యూటీఏ) అధికార ప్రతినిధి అంకుర్ శర్మ మంగళవారం పీటీఐతో మాట్లాడుతూ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ (సీజీడబ్ల్యూఏ) మార్గదర్శకాలు అనుసరించలేమని స్పష్టంచేశారు. తమ సమ్మెతో ముంబైవ్యాప్తంగా నీటిని సరఫరా చేసే 2,500 ట్యాంకర్లు సమ్మెలో పాల్గొంటున్నాయని చెప్పారు. ఇది తమకు చావో-రేవో పరిస్థితన్నారు. రాతపూర్వకంగా హామీ లభిస్తే తప్ప సమ్మెను విరమించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. తమకు ప్రత్యేకించి డిమాండ్లేమీ లేవని, సీజీడబ్ల్యూఏ, ముంబై పోలీసులు, బృహన్ మున్సిపల్ కార్పొరేషన్ చర్యలతో బలవంతంగా తమ వ్యాపారాలను మూసివేయాల్సి వచ్చిందని చెప్పారు. సీజీడబ్ల్యూఏ చెప్పినట్లు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకుంటాం, రెవెన్యూ చెల్లింపులకూ ఒప్పుకుంటాంగానీ మిగతా మార్గదర్శకాలను అనుసరించలేం. భూ జలాలు తోడాలంటే 2000 చదరపు అడుగుల భూమిని ప్రైవేటు ట్యాంకర్ యజమానులకు ఉండాలని, సెక్యూరిటీ డిపాజిట్‌గా స్థానిక యంత్రాంగానికి రూ.6,50,000ను కట్టాలని, ఒక చోట నుంచి ఐదు కంటే ఎక్కువ ట్యాంకర్లు నీటిని తోడేందుకు వీల్లేదని షరతులు పెట్టారు. వీటన్నింటిని అనుసరించలేం. 2,500 ట్యాంకర్లు ముంబైలో నీటిని సరఫరా చేస్తాయని, ట్యాంకర్ యజమానుల 550 కుటుంబాలు, వారు నియమించుకునే సిబ్బంది కుటుంబాలు ఈ వ్యాపారంపై ఆధారపడి ఉన్నాయి. 60ఏళ్లకుపైగా ఇదే పనిచేస్తున్నాం. 10వేల లీటర్ల నీటికి రూ.800 చొప్పున ట్యాంకర్ ఆపరేటర్లు తీసుకుంటారు. సీజీడబ్ల్యూఏ నిబంధనలన్నింటిని అమలు చేస్తే ముంబైలోని ప్రాజెక్టులకు నీరందదు. బీఎంసీ మెగా కోస్తా ప్రాజెక్టు ఒక్కదానికే నిత్యం 700 వాటర్ ట్యాంకర్ల నీరు కావాలి. రైల్వేకు 300 ట్యాంకర్ల నీరు అవసరమవుతుంది. మెగా మౌలిక ప్రాజెక్టులు, ఆసుపత్రులు, స్కూళ్లు, జింఖానాలు, అనేక హౌసింగ్ సొసైటీలు తదితరాలకు సమ్మె కారణంగా నీటి సరఫరా లేదు' అని శర్మ అన్నారు. భూ జల వనరుల నిర్వహణ-అభివృద్ధిని నియంత్రించేందుకు సీజీడబ్ల్యూఏ జారీచేసిన మార్గదర్శకాలను ముంబై, మహారాష్ట్ర (శివారు) జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ అమలు చేస్తున్నాయన్నారు. అనుసరించని ట్యాంకర్ల యజమానులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అధికారం పోలీసులకున్నదని చెప్పారు. బీఎంసీలోని వేర్వేరు శాఖల నుంచి ట్యాంకర్ల యజమానులకు కొద్దినెలలుగా వరుస నోటీసులు అందుతున్నాయన్నారు. ఈనెలారంభంలో ముంబై పోలీసు కమిషన్‌కు బీఎంసీ ఓ లేఖ పంపిందని, అందులో కొత్త మార్గదర్శకాలు అనుసరించని ట్యాంకర్ల యజమానులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని కోరిందని శర్మ తెలిపారు.

శాస్త్రీయంగా ఆలోచించమంటే అసహనం ఎందుకు?

మోదీ భజన శ్రేయస్కరం కాదు

వీపీహెచ్ పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో జరుగుతున్న పరిణామాల్ని శాస్త్రీయంగా ఆలోచించాలని ప్రజలను కోరుతుంటే కొంత మంది అసహనం వ్యక్తం చేయటం హాస్యాస్పదంగా ఉందని వక్తలు అన్నారు. విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ సభలో వారు పాల్గొన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న 33వ విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా డాక్టర్ దేవరాజు మహారాజు రాసిన 'దేశంలో గౌరవనీయులైన మూర్ఖులు' పుస్తకాన్ని విశ్రాంత ప్రొఫెసర్ అంజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆయన పరిచయం చేస్తూ చరిత్రలో సామరస్యతని దృష్టిలో పెట్టుకోవటంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని కూడా అలవాటు చేసుకోవాలన్నారు. ఆవును పవిత్రంగా భావించే వాళ్లతో తాము విభేదించటం లేదన్నారు. కొంత మంది పనిగట్టుకుని అసహనం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. పాడిపరిశ్రమలో ఆవు ప్రాధాన్యత ఎంత ఉందో వారికి తెలియదన్నారు. ఆవుపేడలో ఏముందో పరిశోధించటానికి డబ్బులు కేటాయిస్తారు గాని విశ్వవిద్యాలయాల్లో శాస్త్రీయ విజ్ఞాన పరిశోధనకు నిధులు కేటాయించరని విమర్శించారు. అనంతరం ముక్తవరం పార్థసారథి రాసిన 'నవలాలోకం-4' పుస్తకాన్ని భీమవరం ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు కాకుమాని శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పుస్తకాన్ని పరిచయం చేస్తూ పుస్తకాన్ని రాయటానికి కవులు, రచయితలు ఎంతో కష్టపడతారని ఆ శ్రమను ప్రజలు, పాఠకులు గుర్తించటం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది తెలుగు వారు ఉన్నా తెలుగు పుస్తకం కనీసం 200 ప్రతులు కూడా అమ్ముడు కావటం లేదన్నారు. రచయిత పార్థసారథి కథలో పాత్రల పరిచయంతోనే నవల మొత్తం చదివిన అనుభూతి కలుగుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ తోటి మనిషి గౌరవించలేని వారు పశువుల్ని కౌగిలించుకోమని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గంగా జలం తాగితే మహిళలకు సుఖ ప్రసవం జరుగుతుంది, గంగా నదిలో ఉండే కొన్ని రాళ్లతో రుద్దితే క్యాన్సర్ నయం అవుతుందనే అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు యువతను తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. మోదీకి భజన చేయటం శ్రేయస్కరం కాదని హితవు పలికారు. ఈ సందర్భంగా అతిథులకు బుక్‌ఫెస్టివల్ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు పుస్తకాలను బహూకరించారు.

అల్లరిమూకల అసహనం

విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం కొంత మంది అల్లరమూకలు అలజడి సృష్టించే ప్రయత్నం చేశాయి. విజ్ఞాన ప్రదర్శనలో ఇలాంటి ఘటనలకు తావు లేదని బుక్‌ఫెస్టివల్ కన్వీనర్ డి.విజయకుమార్ వారిని హెచ్చరించి సమస్యను సద్దుమణిగేలా చేశారు. ముందుగా జరిగిన సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పాల్గొన్నారు. సభ అనంతరం మంత్రి వెళ్లబోతుంటే బీజేపీ నేతలు భూకబ్జాలకు పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక సభ్యులు వినతి పత్రం అందించేందుకు ప్రయత్నించారు. మంత్రి వారిని లెక్కచేయకపోవటంతో పెద్దపెట్టున నినాదాలు చేయటంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సభావేదిక వద్ద అలజడి నెలకొంది. అనంతరం విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ సభ ప్రారంభంలో సభాధ్యక్షులు గడ్డం కోటేశ్వరరావు పరిచయ వ్యాఖ్యలు చేస్తుంటే కొంత మంది హిందూ అసహనవాదులు గట్టిగా అరుస్తూ ఎదురుదాడి చేశారు. హిందుత్వ వాదులు, వామపక్ష వాదులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బుక్‌ఫెస్టివల్ కన్వీనర్ డి.విజయకుమార్ వేదికపై నుంచి కిందకు వచ్చి వారిని సముదాయించారు.

ఏపీలో పర్యాటకాభివృద్ధికి కృషి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 50 పర్యాటక ప్రాంతాలతో పాటు, ఆధ్యా త్మిక టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చెప్పారు. అమరావతిలో మంగళవారం బుద్ధ సర్క్యూట్ ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.బౌద్ధం, సిక్కిజం, జైనిజం, హైందవం ఈ నాలుగు మతాలకు భారతదేశం పుట్టినిల్లుగా పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ కింద రూ.7 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కాకినాడ వన్యప్రాణుల అభయారణ్యం, బుడమేరు, మైపాడ్ బీచ్, బౌద్ధమత సర్క్యూట్, అమరా వతి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతి లింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 27.7 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఏపీ పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులు కేంద్రం చేయిస్తుందన్నారు. కరోనా అనంతరం 2022 నుంచి పర్యాటకం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఎప్పుడూ లేనివిధంగా శ్రీనగర్‌కు ఈ ఏడాది అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారని తెలిపారు. స్వదేశీ దర్శన్ పథకంలో కడప గండికోట, అరకు, లంబసింగి ప్రాంతాలతోపాటు, నాగార్జున కొండను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే ట్రైబల్ మ్యూజియాన్ని అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ నుంచి అరకు వరకు అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే అద్దాలతో కూడిన ట్రైన్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అమరావతిని స్మార్ట్ సిటీగా ప్రకటించి 500 కోట్ల రూపాయలు కేంద్రం కేటాయించిం దన్నారు. సింహాచలం, అరుణాచలం, నెల్లూరు వేదగిరి లక్ష్మీనరసిం హస్వామి ఆలయాన్ని ఈ ఏడాది అభివృద్ధి చేయడా నికి సహాయం అందిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. సాంస్కృతిక వారసత్వ సంపద, తెలుగు వారి ఔన్నత్యాన్ని ఇనుమడింపచేసేలా అంతర్జాతీయ ప్రమా ణాలతో బాపు మ్యూజియంను తీర్చి దిద్దారని మంత్రి కిషన్ రెడ్డి అధికారులను అభి నందించారు. విజయవాడ లోని బాపు మ్యూజియంను మంగళవారం మంత్రి సంద ర్శించి మ్యూజియంలో ఉన్న వారసత్వ సాంస్కృతిక సంపద ను, పురాతన వస్తువులను పరిశీలించారు. బాపు మ్యూజి యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇంటరాక్టివ్ డిస్ ప్లే టెక్నాలజీ, ఇంప్రెసివ్ ప్రొజెక్షన్ థియేటర్, ప్రొజెక్షన్ మాపింగ్, ఆగ్ మెంటెడ్ రియాలిటీ, ఇంటరాక్టివ్ డిజిటల్ డిస్ ప్లే ప్యానెల్, ఇంటరాక్టివ్ డిస్ ప్లే కాబినెట్స్, ఇంటరాక్టివ్ కియోస్కోస్ మొదలైనవి ప్రవేశ పెట్టడం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి తార్కాణమన్నారు.

జేపీసీ అంటే భయమెందుకు? : కాంగ్రెస్

న్యూదిల్లీ: దాచేందుకు ఏమీ లేనప్పుడు జేపీసీ విచారణ అంటే ప్రభుత్వం ఎందుకని పారిపోతోందంటూ అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. అదానీ వ్యవహారంలో బీజేపీ భయపడేందుకు, దాచేందుకు ఏమీ లేదన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అదానీ గ్రూపుపై నిష్పాక్షిక విచారణ జరపాలని కోరుతూ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చీఫ్ మధాబి పూరీ బుచ్‌కు లేఖలు పంపినట్లు తెలిపారు. వారు దాచేందుకు ఏమీ లేకపోతే ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ విచారణ అంటే ఎందుకు భయపడిపోతున్నారని అమిత్‌షా వ్యాఖ్యలనుద్దేశించి ప్రశ్నించారు. 'పార్లమెంటులో జేపీసీకి డిమాండ్‌పై మాట్లాడనివ్వడం లేదు. మా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నేతలు జేపీసీ కోసం డిమాండ్ చేస్తే వారి వ్యాఖ్యలను తొలగించేశారు' అని జైరాం రమేశ్ అన్నారు. దాచేందుకు ఏమీ లేనప్పుడు జేపీసీకి ప్రభుత్వం అనుమతిని ఎందుకివ్వడం లేదని నిలదీశారు. అదానీపై ప్రభుత్వంతో ఆయన అనుబంధంపై దర్యాప్తు జరిపించాలని నొక్కిచెప్పారు. ప్రైవేటు పెట్టుబడులకు కాంగ్రెస్ అనుకూలమన్నారు. తమ పోరు క్రోని కేపటిలిజంపై మాత్రమేనని స్పష్టంచేశారు. రమేశ్ ఇంతకుముందు ట్విట్టర్ మాధ్యమంగా 'హమ్ అదానీ కే హై కౌన్?' (మనకు అదానీకి సంబంధం ఏమిటి?) అని మోదీని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

గ్రాంట్ థర్న్‌టన్‌కు 'అదానీ' ఆడిట్ బాధ్యతలు

న్యూదిల్లీ: అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ వెలువరించిన నివేదిక క్రమంలో అదానీ గ్రూపు కంపెనీలపై వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా మదుపర్లను కలవరపెట్టాయి. దీంతో తమ సంస్థపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని రుజువు చేసే పనిలో అదానీ గ్రూపు నిమగ్నమైంది. ఇందులో భాగంగా స్వతంత్ర ఆడిట్ బాధ్యతలను అకౌంటెన్సీ సంస్థ 'గ్రాంట్ థర్న్‌టన్'కు అప్పగించింది. దాచేందుకు ఏమీ లేదని, సంబంధిత చట్టాలకు కట్టుబడే ఉన్నామని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వంటి రెగ్యులేటర్లకు ప్రాథమికంగా రుజువు చేసేందుకు ఈ ఆడిట్ అని అధికార వర్గాలు వెల్లడించాయి. నిధులు, రుణాల వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయా అన్నదానిపైనే ఆడిట్ ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు తెలిపాయి. లెక్కపత్రాలన్నీ సరిగ్గా ఉన్నాయని, అవక తవకలు జరగలేదని, ప్రాజెక్టులన్నీ సక్రమంగా సాగాయి /సాగుతున్నాయని రుజువు చేసేందుకు ఈ ఆడిట్ సాగనున్నట్లు పేర్కొన్నాయి. కాగా తమ వృద్ధి ప్రణాళికల్లో మార్పు లేదని, వ్యాపార ప్రణాళికలకు నిధుల కొరత లేదని, భాగస్వాములకు రిటర్న్స్ ఇవ్వగలమని విశ్వాసం చూపుతూ సోమవారం మార్కెట్లను శాంతిపజేసే ప్రయత్నాన్ని అదానీ సంస్థ చేసింది.

రెండో టెస్టుపై ఉత్కంఠ

ఐదేళ్ల తర్వాత దిల్లీ మైదానంలో ఐదురోజుల మ్యాచ్

న్యూదిల్లీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల మధ్య నాలుగు టెస్టుల సిరీస్‌లో మొదటి మ్యాచ్ నాగ్‌పూర్‌లో జరిగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా కంగారూలను ఇన్నింగ్స్ 132 పరుగుల తేడాతో ఓడించింది. ఇప్పుడు రెండో టెస్టుకు ఇరు జట్లు సిద్ధమయ్యాయి. ఫిబ్రవరి 17 నుంచి దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో సిరీస్‌లో రెండో టెస్టు మ్యాచ్ జరగనుంది. దాదాపు 5ఏళ్ల తర్వాత ఈ మైదానంలోకి టెస్ట్ క్రికెట్ తిరిగి వచ్చింది. దీనికి ముందు 2017లో అరుణ్ జైట్లీ స్టేడియంలో చివరి టెస్టు మ్యాచ్ జరిగింది. రెండో టెస్టులో విజయం సాధించి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని భారత జట్టు భావిస్తోంది. అదే సమయంలో సిరీస్ సమం చేయాలనే ఉద్దేశంతో ఆస్ట్రేలియా జట్టు రంగంలోకి దిగనుంది. దీంతో దిల్లీ టెస్టుపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.

హాట్ కేకుల్లా అమ్ముడైన టికెట్లు

దిల్లీ టెస్ట్ మ్యాచ్ టికెట్లు మొత్తం అమ్ముడయ్యాయి. ఈ మైదానంలో దాదాపు 40 వేల మంది ప్రేక్షకులు కూర్చుని మ్యాచ్‌ను

చూడవచ్చు. దాదాపు 24000 టికెట్లు సాధారణ అభిమానులకు అందించారు. నిబంధనల ప్రకారం 8000 టికెట్లను డీడీసీఏ అధికారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉన్న అన్ని టికెట్లు అమ్ముడయ్యాయని స్టేడియం మేనేజ్‌మెంట్ ప్రకటించింది. డీడీసీఏ జాయింట్ సెక్రటరీ రాజన్ మంచాంద మాట్లాడుతూ... రెండో టెస్టు మ్యాచ్ సందర్భంగా అభిమానులు పెద్దఎత్తున స్టేడియానికి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు. దీంతోపాటు రెండు జట్ల మధ్య ఉత్కంఠ పోరు జరగనుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

స్టార్క్ పునరాగమనం ఖాయం

ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టు మ్యాచ్‌కు శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉండడని భావిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ గాయంతో పోరాడుతున్నాడు. ఇక ఆస్ట్రేలియా జట్టు గురించి చెప్పాలంటే... రెండో టెస్టు మ్యాచ్‌లో ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ పునరాగమనం దాదాపు ఖాయంగా మారింది. ఒకవేళ మిచెల్ స్టార్క్ దిల్లీ టెస్టులో పునరాగమనం చేస్తే, ఫాస్ట్ బౌలర్ షాన్ బొలాండ్ బెంచ్‌కే పరిమితం కావొచ్చు. తొలి టెస్టు మ్యాచ్‌లో షాన్ బొలాండ్‌కు వికెట్ దక్కలేదు. అయితే, భారత జట్టు దిల్లీటెస్ట్‌తోపాటు సిరీస్‌ను గెలుచుకోవడం ద్వారా ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలని ఆశిస్తోంది.

కోహ్లీ... రోహిత్‌ని చూసి నేర్చుకో!

ముంబై: వన్డే, టీ20ల్లో ఫామ్‌లోకి వచ్చిన విరాట్ కోహ్లీ, టెస్టుల్లో మాత్రం మునుపటి ఫామ్‌ని అందుకోలేకపోతున్నాడు. గత మూడేళ్లలో విరాట్ కోహ్లీ టెస్టు సగటు 30 పరుగులు కూడా దాటలేదు. 2021లో ఇంగ్లాండ్ టూర్‌లో విదేశాల్లో మొట్టమొదటి టెస్టు సెంచరీ నమోదు చేసిన రోహిత్ శర్మ, నాగ్‌పూర్ టెస్టులో సెంచరీ చేసి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పూజారా, సూర్యకుమార్ యాదవ్, శ్రీకర్ భరత్ విఫలమైనా 120 పరుగులు చేసిన రోహిత్ శర్మ... తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 400 పరుగుల భారీ స్కోరు చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌పై టీమిండియా మాజీ క్రికెటర్, క్రికెట్ వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'టీమిం డియా బ్యాటింగ్ ఆర్డర్‌కి రోహిత్ శర్మ కీ ప్లేయర్. నిజానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బ్యాటర్లకు రోహిత్ ఓ టెంప్లేట్ సెట్ చేసి పెట్టాడు. భారత పిచ్‌లపై, ముఖ్యంగా టర్నింగ్ పిచ్‌లపై ఎలా ఆడాలో రోహిత్ శర్మ ఇన్నింగ్స్ చూసి తెలుసుకోవాలి...ఆస్ట్రేలియా బ్యాటర్లకు మాత్రమే కాదు, భారత జట్టులోని ప్లేయర్లు కూడా రోహిత్ ఇన్నింగ్స్ చూసి ఎలా ఆడాలో నేర్చుకోవాలి. స్పిన్నర్లను ఎలా ఆడాలో విరాట్ కోహ్లీ, రోహిత్

శర్మ బ్యాటింగ్ నుంచి నేర్చుకుంటే బెటర్...సాధారణంగా బ్యాటర్లు, బౌలర్ బంతి వేసిన తర్వాత దాని లెంగ్త్‌ని అర్థం చేసుకుని, పిచ్ మీద ఎక్కడ పడుతుందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే బ్యాక్ ఫుట్‌కి వెళ్లడం వల్ల ఇంకాస్త సమయం దొరుకుతుంది...

కొద్దిగా వెనక్కి వెళ్లడం వల్ల బంతి దిశను అర్థం చేసుకోవడానికి ఇంకాస్త సమయం దొరుకుతుంది. రోహిత్ బ్యాటింగ్‌లో టెక్నిక్ ఇదే' అని మంజ్రేకర్ అన్నాడు. నాగపూర్ టెస్టులో ఓపెనర్ కెఎల్ రాహుల్ 71 బంతుల్లో ఓ ఫోర్‌తో 20 పరుగులు చేసి అవుట్ కాగా, వన్‌డౌన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా వచ్చిన రవిచంద్రన్ అశ్విన్ 62 బంతుల్లో 2 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 23 పరుగులు చేసి పర్వాలేదని పించాడు. ఛతేశ్వర్ పుజారా 14 బంతుల్లో ఓ ఫోర్‌తో 7 పరుగులు చేయగా విరాట్ కోహ్లీ 26 బంతుల్లో 2 ఫోర్లతో 12 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కెఎల్ రాహుల్, అశ్విన్, పూజారా, కోహ్లీ నలుగురు కూడా తొలి మ్యాచ్ ఆడుతున్న ఆసీస్ స్పిన్నర్ టాడ్ ముర్ఫీ బౌలింగ్‌లోనే అవుట్ అయ్యారు. 10 బంతుల్లో ఓ ఫోర్‌తో 8 పరుగులు చేసిన శ్రీకర్ భరత్ కూడా ముర్ఫీ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ముర్ఫీ బౌలింగ్‌ని సమర్థవంతంగా ఎదుర్కొన్న రోహిత్ శర్మ 212 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 120 పరుగులు చేసి ప్యాట్ కమ్మిన్స్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు.

విమర్శించే వారికి ఇక్కడ జరిగేది తెలియదు

బోర్డర్ వ్యాఖ్యలపై ఆసీస్ వికెట్‌కీపర్ స్పందన

దిల్లీ: నాగ్‌పూర్ టెస్టులో స్టీవ్ స్మిత్ వ్యవహార శైలిపై ఆసీస్ మాజీ సారథి అలెన్ బోర్డర్ తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. స్మిత్... జడేజా, అశ్విన్ లను బాగా బౌలింగ్ చేసినప్పుడు వారికి బాగా వేశావని 'థమ్సప్'చూపించడం ఆయనకు కోపం తెప్పించింది. ఏం సాధించావని అలా థమ్సప్ చూపిస్తున్నావని బోర్డర్ విమర్శలు చేశాడు. ఇండియా-ఆస్ట్రేలియా మధ్య నాగ్‌పూర్ వేదికగా ముగిసిన తొలి టెస్టులో కంగారూలు ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ టెస్టులో భారత స్పిన్ త్రయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌ల స్పిన్ ఉచ్చులో చిక్కుకున్న ఆసీస్... రెండు ఇన్నింగ్స్‌లలో దారు ణంగా విఫలమైంది. మరీ ముఖ్యంగా భారత్ లో మంచి రికార్డు ఉన్న స్టీవ్ స్మిత్... స్పిన్ ను బాగా ఆడగలడన్న పేరున్న లబూషేన్ లతో పాటు మిడిలార్డర్ బ్యాటర్లు హ్యాండ్స్‌కాంబ్, అలెక్స్ క్యారీలు ఘోరంగా విఫలమయ్యారు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఒక్క ఆసీస్ బ్యాటర్ కూడా అర్ధ సెంచరీ చేయకపోవడం గమ నార్హం. స్మిత్ బ్యాటింగ్‌పై బోర్డర్ మాట్లా డుతూ.. 'భారత పిచ్‌లపై ఎడ్జ్ రాకుండా బ్యాటింగ్ చేయాలి. భారత స్పిన్నర్లు ఆఫ్ స్టంప్ అవతల బాల్ వేసి, నిన్ను బీట్ చేసిన ప్రతీసారి వాళ్లకు థమ్సప్ చూపిస్తున్నావు. అసలు ఇదేం పిచ్చి. బుద్ధి ఉండే ఈ పని చేస్తున్నావా. ఆస్ట్రేలియా ఎప్పుడూ అగ్రెసివ్ క్రికెట్ ఆడుతుంది. ప్రత్యర్థి బౌలర్లకు థమ్సప్ ఇవ్వడమనేది చెత్త పని. ఆ సమయంలో నీ వీక్‌నెస్ బౌలర్లకు అర్థమై పోతోంది. ఇండియా టూర్ ఎలా ఉండబోతుందో ఇప్పటికే మీకు అర్థమైపోయి ఉంటుంది. ఇంకా మూడు టెస్టులు ఆడాలి. చాలా కఠినమైన పిచ్‌లను ఫేస్ చేయాలి'అని అన్నాడు. ఈ వ్యాఖ్యలపై తాజాగా ఆ జట్టు వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ స్పందించాడు. బోర్డర్ ను తాము గౌరవిస్తామని, కానీ ఇక్కడ ఏం జరుగుతోందనేది విమర్శ కులకు తెలియదని చెప్పాడు. క్యారీ మాట్లా డుతూ... 'మేం అలెన్ బోర్డర్ ను గౌరవిస్తాం. ఆయన లెజెండ్. బయట నుంచి కామెంట్స్ చేసేవాళ్లకు డ్రెస్సింగ్ రూమ్ లో ఏం జరుగుతుందో తెలియదు. మేం భిన్నంగా ఆడేందుకు యత్నిస్తూనే ఉన్నాం. కొన్ని కొన్నిసార్లు పరిస్థితులు అందుకు అనుకూలంగా లేకపోవచ్చు' అని తెలిపాడు.

రేణుదేశాయ్‌కు గుండె సంబంధ ఆరోగ్య సమస్య

హైదరాబాద్: ఇటీవలి కాలంలో సమంత, మమత మోహన్ దాస్ వంటి హీరోయిన్లు వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. తాజాగా పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్ కూడా తన అనారోగ్యం గురించి వెల్లడించారు. తాను కొన్నాళ్లుగా గుండె, ఇతర సమస్యలతో బాధపడుతున్నానని... తనను దగ్గరగా చూస్తున్నవారికి ఈ విషయం గురించి తెలుసని చెప్పారు. వాటిని ఎదుర్కొనేందుకు కావాల్సిన శక్తిని కూడగట్టుకుంటున్నానని తెలిపారు. తనకు ప్రస్తుతం చికిత్స జరుగుతోందని, మందులను వాడుతున్నానని, యోగా చేస్తున్నానని చెప్పారు. మంచి పోషక పదార్థాలను ఆహారంగా తీసుకుంటున్నానని తెలిపారు. తనలా ఎవరైనా సమస్యలతో బాధపడుతుంటే వారిలో ధైర్యాన్ని నింపేందుకే ఈ విషయాన్ని పోస్ట్ చేస్తున్నానని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ధైర్యాన్ని కోల్పోకూడదని సూచించారు. త్వరలోనే అనారోగ్యం నుంచి కోలుకుని షూటింగుల్లో పాల్గొంటానని తెలిపారు.

వరుస సినిమాలతో పవన్ కల్యాణ్ బిజీ బిజీ



హైదరాబాద్: పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ బ్యాక్ సినిమాలతో బిజీ బిజీగా గడుపుతున్నాడు. ప్రస్తుతం సెట్స్ మీదున్న సినిమాలను పూర్తిచేయడం దృష్టి సారించాడు. ప్రస్తుతం పవన్ 'హరిహర వీరమల్లు' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. క్రిష్ దర్శకత్వంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో ఎక్కడలేని అంచనాలు నెలకొన్నాయి. ఇక దీనితో పాటుగా వినోదయ సిత్తం రీమేక్‌ను కూడా ప్రారంభించే పనిలో ఉన్నాడు. పి. సముద్రఖని దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో సాయి ధరమ్ తేజ్ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఈ సినిమాను హరిహర వీరమల్లు కంటే ముందే రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. హరిహర వీరమల్లును ముందుగా ఏప్రిల్‌లో అనుకున్నా.. షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండటంతో దసరాకు ప్లాన్ చేస్తున్నారు.

డబ్ల్యూపీఎల్ వేలంలో తెలుగమ్మాయిల సత్తా

ముంబై: మార్చిలో ప్రారంభంకానున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్రికెట్ కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన లీగ్ వేలం-2023లో ఆరుగురు తెలుగు అమ్మాయిలు వివిధ జట్లకు ఎంపికయ్యారు. అంజలి శర్వాణి, సబ్బినేని మేఘన, షబ్నమ్ షకీల్, సొప్పదండి యషశ్రీ, అరుంధతి రెడ్డి, స్నేహ దీప్తి తమ ఆటతో సత్తా చాటి ఫ్రాంఛైజీల దృష్టిని ఆకర్షించారు. కర్నూల్ జిల్లా ఆదోనికి చెందిన లెఫ్టార్మ్ పేస్ బౌలర్ అంజలి శర్వాణి భారత్ తరఫున 6 టీ20లు మ్యాచ్‌లు ఆడింది. ఈమెను రూ.55 లక్షలకు యూపీ వారియర్స్ ఎంపిక చేసుకుంది. అండర్-19 ప్రపంచకప్ జట్టు క్రీడాకారిణి విశాఖకు చెందిన రైట్ ఆర్మ్ పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.10 లక్షలకు ఎంపిక చేసుకుంది. ఇదే ప్రాంతానికి చెం దిన వి.స్నేహ దీప్తి భారత్ తరఫున 1 వన్డే, 2 టీ20లు ఆడి తన ప్రతిభను కనబరించింది. ఈమెను దిల్లీ క్యాపిటల్స్ టీమ్ రూ.30 లక్షలకు ఎంపిక చేసుకుంది.విజయవాడకు చెం దిన సబ్బినేని మేఘన...టీమ్‌ఇండియా తరఫున 3

వన్డేలు , 17 టీ20 మ్యాచ్‌లు ఆడింది. ఈమెను గుజరాత్ జెయింట్స్... రూ.30 లక్షలకు కొనుగోలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పేస్‌బౌలర్ సొప్పదండి యషశ్రీ ఇటీవల అండర్-19 ప్రపంచకప్‌లో ఆడింది. ఈమెను యూపీ వారియర్స్ రూ.10 లక్షలకు ఎంపిక చేసుకుంది. ఇదేప్రాంతానికి చెం దిన రైట్ ఆర్మ్ పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి... భారత్ తరఫున 26 టీ20లు ఆడింది. ఈమెను రూ.30 లక్షలకు దిల్లీ క్యాపిటల్స్ జట్టు ఎంపిక చేసుకుంది. వీరిలో అంజలి శర్వాణికి అత్యధికంగా రూ.55 లక్షల ఆఫర్ వచ్చింది. ఇదిలా ఉండగా అండర్-19 మహిళల ప్రపంచకప్-2023లో సత్తా చాటిన తెలంగాణ అమ్మాయి, భద్రాచలానికి చెందిన గొంగడి త్రిషను మాత్రం ఏ జట్టు ఎంపిక చేసుకోలేదు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.